Licensed to post without Prepayment No. J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 18.10.2019, శుక్రవారం సంపుటి : 39 సంచిక : 20 పేజీలు : 12, వెల : ₹ 5




లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com

అవకాశవాదంలో కొత్త స్నేహం!

# భాజపా బాటలోకి బాబు?




- టిడిపి శ్రేణుల నుండి వెలువడుతున్న సంకేతాలు
- కేసుల నుండి బయటపడేందుకు బాబు ముందున్న మార్గం
- ఏపిలో పెరగడానికి కమలానికి వున్న ఏకైక మార్గం

రాజకీయాలలో పరస్పర ప్రయోజనాలే పార్టీలు లేదా నాయకుల మధ్య పరమావధిగా వుంటాయి. ప్రతి అంశంలోనూ నాకు ఇవి, నీకు అవి అనే లెక్కలే వుంటాయి. ఈ లెక్కల్లో విలువలకు విలువ వుండదు. సిద్ధాంతాలకు తావుండదు. ఎవరి రాజకీయ ప్రయోజనాలు ఎంతవరకు నెరవేరుతాయనేదానికి మాత్రమే స్థానముంటుంది.

(మిగతా 11వ పేజీలో)

## సంక్రాంతి పండుగ దాకా...

# పథకాల పండుగే!




- దేశ చరిత్రలో కనీవినీ ఎరుగని సంక్షేమ పథకాల జాతర
- నవరత్నాల అమలు తర్వాత పూర్తిస్థాయిలో అభివృద్ధిపై దృష్టి

**రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చాక... వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఏం జరుగుతోంది... అమరావతి రాజధానిపై దృష్టి లేదు... పోలవరం ప్రాజెక్ట్ కాంట్రాక్ట్ రద్దయ్యింది.. రివర్స్ టెండరింగ్ ద్వారా దాదాపు వెయ్యి కోట్లు తక్కువతో ఆ ప్రాజెక్ట్‌ను మెగా ఇంజనీరింగ్ కంపెనీ దక్కించుకుంది. వరదల మూలంగా పోలవరం పనులు ఆగివున్నాయి. రాష్ట్రానికి ఇంకా కొత్త పెట్టుబడులు రాలేదు. రియల్ ఎస్టేట్ రంగం కూడా ముందుకు కదలడం లేదు...**

ఇవన్నీ లేకున్నా, ఇవన్నీ ఆగివున్నా రాష్ట్రంలో పథకాల పండుగ మాత్రం జరుగుతోంది. 'నవరత్నాలు' జాతర జరుగుతోంది. దేశ చరిత్రలో ఇంతవరకు ఏ రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి కూడా అమలు చేయలేనన్ని సంక్షేమ పథకాలు, ఇవ్వనన్ని ఉద్యోగాలు వై.యస్.జగన్మోహన్‌రెడ్డి కేవలం తన నాలుగు నెలల పాలనాకాలంలోనే అమలు చేశాడు. రాష్ట్రం ఆర్థిక లోటులో వుంది. గత ముఖ్యమంత్రి చంద్రబాబు రెండున్నర లక్షల కోట్ల అప్పును మన నెత్తిపై రుద్దిపోయాడు. రాష్ట్రానికి వస్తున్న ఆదాయం కాని.. కేంద్రం విదిలిస్తున్న సాయం కాని.. అంతంత మాత్రమే. అయినా ఇన్ని ప్రతికూలతల మధ్య జగన్ తన ఎన్నికల మేనిఫెస్టో నవరత్నాలను అమలు చేయడంలో ఎక్కడా వెనక్కి తగ్గలేదు. వాగ్ధానాలను విస్మరించి వెన్నుచూపలేదు.

### హామీల అమలుకే ప్రాధాన్యత:

జగన్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన మరుక్షణం నుండే మేనిఫెస్టోలో చెప్పిన అన్ని హామీల అమలుకు శ్రీకారంచుట్టాడు. అవ్వా తాతలకు పింఛన్ 2,250 రూపాయలకు పెంచడం నుండే సంక్షేమ పథకాల పండుగను ప్రారంభించాడు. వికలాంగులు, వితంతువుల పింఛన్ పెంచాడు. ఆశా వర్కర్ల జీతాలను 10వేలు చేశాడు. 'అమ్మఒడి' పథకాన్ని ప్రారంభించాడు. ఆటో కార్మికులకు, వృత్తి కార్మికులకు ఏడాదికి 10వేలు నగదు ఇచ్చే ప్రక్రియ మొదలుపెట్టాడు. పారిశుద్ధ్య కార్మికుల వేతనాలను పెంచాడు. హోంగార్డ్ల వేతనాలు పెరిగాయి. రైతు భరోసా క్రింద రైతులకిచ్చే సాయాన్ని 13,500రూపాయలు చేశాడు. న్యాయవాదులకు స్టైఫండ్ క్రింద నెలకు 5వేలు ప్రకటించాడు. పాస్టర్లు, మౌజన్‌లకు జీతాలు ప్రకటించాడు. కిడ్నీ, తలసేమియా వ్యాధిగ్రస్తులకు నెలనెల ఆర్థిక సాయం అందిస్తున్నాడు.

### వందరోజుల్లోనే లక్షలాది మందికి ఉద్యోగాలు :

ఇక ఉద్యోగాలను ఇవ్వడం అయితే దేశ చరిత్రలోనే ఎప్పుడూ లేదు. అధికారంలోకి వచ్చిన వందరోజుల్లోపే వాలంటీర్లు, గ్రామ సచివాలయ కార్యదర్శుల రూపంలో లక్షల సంఖ్యలో ఉద్యోగాలు సృష్టించాడు. అన్నింటికి మించి ఎన్నో ఏళ్లుగా వేలాది మంది కార్మికుల కోరికగా మిగిలిపోయిన ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను నిజం చేసి చూపించాడు. వై.యస్.జగన్ ఎన్నికల సమయంలో ప్రజలకు తానిచ్చిన హామీలను అమలు చేయడంపైనే ప్రధానంగా దృష్టి పెట్టాడు. ఒకదాని తర్వాత ఒకటి వరుసబెట్టి హామీలను నెరవేరుస్తున్నాడు.

(మిగతా 11వ పేజీలో)



# హైలెవల్ కెనాల్ పూర్తికాకుంటే...

# ఉదయగిరి ఎడారే...



ఇది అక్టోబర్ నెల... ఉదయగిరి, వింజమూరు, దుత్తలూరు, వరికుంటపాడు, సీతారాంపురం మండలాలలోని చాలా గ్రామాలలో ఇప్పటికే ప్రతివీధిలోనూ ప్రతి ఇంటి ముందు నీళ్ల డ్రమ్ములు దర్శనమిస్తున్నాయి. ఇంటికొకటి రెండు లెక్కన డ్రమ్ములుంటాయి. వీధికి ఇరువైపులా ఆ డ్రమ్ములుండడంతో ఆ వీధిల్లోకి వాహనాలు వెళ్లలేని పరిస్థితి. అంటే ఈ ప్రాంతాలలో నీటి కొరత ఎంత తీవ్రంగా వుందనేదానికి ఇది ఉదాహరణ. ప్రతిరోజూ కొన్నివేల ట్యాంకర్ల ద్వారా ప్రతి ఇంటికి నీటి సరఫరా జరుగుతోంది. ఈ నీళ్ళ సరఫరా కోసమే ప్రతి నెల లక్షల్లో ఖర్చవుతోంది. ఈ నీళ్ల ట్యాంకర్లు పెట్టుకోవడమే ఈ ప్రాంతంలో చాలామందికి బ్రతుకుతెరువుగా వుంది.

దాదాపు ఏడాదికాలంగా ఉదయగిరి మండలాలలో నీళ్లకు ఇదే పరిస్థితి. గత నాలుగేళ్లుగా కూడా వర్షాలు లేని కారణంగా చెరువులు, బావులు పూర్తిగా ఎండిపోయాయి. భూగర్భజలాలు అడుగంటాయి. ఒకప్పుడు వందఅడుగులకే నీళ్లు పడేవి. ఇప్పుడు 300 అడుగుల లోతులో బోర్లు వేసినా నీటి చుక్క జాడ కానరావడం లేదు. ఈ ప్రాంతాలలోని చెరువులు నిండి ఎంతకాలమైందో? ఈ ప్రాంతాలలోకి వాగులు పొంగి ప్రవహించగా ఇక్కడి జనం ఎప్పుడు చూశారో?

కాలాలు పూర్తిగా మారిపోయాయి. గతంలోలాగా ఇక్కడ వర్షాలు పడడం లేదు. చెరువుల్లోకి నీళ్లు రావడం లేదు. చెరువుల క్రింద పంటలకు నీళ్లుండడం లేదు. ఇక ముందు కూడా విస్తారంగా వర్షాలు పడతాయని, చెరువులు, బావులు నిండతాయనే నమ్మకం కూడా పోయింది.

ఉదయగిరిప్రాంతం ఎడారి కాకుండా ఉండాలంటే, ఇక్కడి జనం వలసబాట పట్టకుండా వుండాలంటే వున్న ఏకైక మార్గం గత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆనం రామనారాయణరెడ్డి కృషితో మంజూరైన సోమశిల హైలెవల్ కెనాల్‌ను త్వరగా పూర్తి చేయడం. సోమశిల జలాలు జిల్లాలో అన్ని ప్రాంతాలకు వెళతాయి. ఆఖరకు అటు తమిళనాడులోని చెన్నైకి వెళతాయి. కాని గట్టిగా పాతిక కిలోమీటర్ల దూరంలో వుండే ఉదయగిరి మండలాలకు మాత్రం సోమశిల నీళ్ళు ఎక్కవు. ఇది ఎత్తైన ప్రాంతం కావడంతో అప్పట్లో సోమశిల నుండి కాలువల తవ్వకం సాధ్యం కాలేదు. అయితే ఇప్పుడు హైలెవల్ కెనాల్ ద్వారా(లిఫ్ట్ పద్ధతిలో) సోమశిల నుండి ఉదయగిరికి నీళ్ళు తరలించాలన్న ఆలోచన చేయడం ఎంతైనా అభినందనీయం. అయితే కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ఈ కాలువ పనులు మొదలుపెట్టి వుండుంటే ఈ పాటికి పూర్తయ్యి కొంత భాగానికి నీళ్ళన్నా వచ్చేవి. ఈరోజు సోమశిల పూర్తి సామర్ధ్యంతో నిండిపోయింది. సోమశిల నుండి జిల్లాలోని అన్ని ప్రధాన చెరువులు, కాలువలకు నీళ్ళ పోతున్నాయి. ఉదయగిరి ప్రాంత చెరువులకు మాత్రం ఆ అదృష్టం లేదు. సోమశిల హైలెవల్ కెనాల్ పూర్తయ్యుంటే కనీసం కొన్ని చెరువుల కన్నా నీళ్లందేవేమో!

కాంగ్రెస్ ప్రభుత్వం చివరిరోజుల్లో సోమశిల హైలెవల్ కెనాల్ మంజూరయ్యింది. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో చివరిరోజుల్లో ఈ పనికి టెండర్ పిలిచారు. ఇప్పుడు వైసిపి అధికారంలోకొచ్చింది. ఈ కాలువ పనికి కూడా రివర్స్ టెండర్ నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. ఇలా ప్రతి ప్రభుత్వంలోనూ ఈ కాలువ పనుల్లో కాలయాపన జరిగితే... ఈ కాలువ పూర్తయ్యేదెప్పుడు? ఉదయగిరి జనం దాహార్తి తీరేదెప్పుడు. నిర్ణీత గడువు విధించి ఈ కాలువను పూర్తి చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

---

### జగన్ సారధ్యంలో...

## స్వచ్ఛమైన పాలన

**- మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి**

రాష్ట్ర ముఖ్యమంత్రి డా.వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సారధ్యంలో ప్రజలకు స్వచ్ఛమైన పాలన అందుతోందని, ప్రజలకు సేవచేయడమే ప్రధాన లక్ష్యంగా తాము పనిచేస్తున్నామని రాష్ట్ర పరిశ్రమలు, ఐటి శాఖల మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి అన్నారు. ఆత్మకూరులోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో కంటి చికిత్సా విభాగం, సచివాలయ కార్యాలయ భవనాన్ని ఈనెల 14న మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చాక గ్రామస్వరాజ్యం స్థాపించడం తమ ప్రభుత్వానికే సాధ్యమైందన్నారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చిన నాలుగునెలల్లోనే గ్రామ, వార్డు వాలంటీర్లు, సచివాలయ ఉద్యోగవ్యవస్థలో 5.27 లక్షల మందికి ఉద్యోగావకాశాలు కల్పించిందని, 'రైతు భరోసా' కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా లక్షలాదిమంది రైతులకు మేలు కలుగుతుందన్నారు. గతంలో ప్రకటించిన మేరకు ఈ పథకం 2020లో ప్రారంభం కావాల్సి ఉండగా, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఏడాది ముందుగానే ఈ పథకాన్ని అమలుచేసి తమ ప్రభుత్వం రైతుపక్షం వహించే ప్రభుత్వమని నిరూపించుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపి నాయకులు అల్లారెడ్డి ఆనందరెడ్డి, డాక్టర్ సిహెచ్ ఆదిశేషయ్య, నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, చల్లా రవికుమార్‌రెడ్డి, చిన్నపరెడ్డి, కొండా వెంకటేశ్వర్లు, పందిళ్లపల్లి సుబ్బారెడ్డి, బోయెళ్ళ పద్మజారెడ్డి, షేక్ పర్వీన్‌లతో పాటు ఆర్డీఓ పి.ఉమాదేవి, మునిసిపల్ కమిషనర్ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

### కొత్త ఇసుక విధానాలతో

## ట్రాక్టర్ కార్మికుల ఇబ్బందులు

ప్రభుత్వం విధించిన కొత్త ఇసుక విధానాల వల్ల ట్రాక్టర్ కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, వీరిని ప్రభుత్వం ఆదుకోవాలంటూ ఈనెల 14న నెల్లూరు కలెక్టరేట్ కార్యాలయం వద్ద జిల్లా ట్రాక్టర్స్ యజమానులు సంఘ( ఏఐటీయూసి) నాయకులు ధర్నా చేపట్టారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కొత్త ఇసుక పాలసీలతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ప్రభుత్వం నిబంధనలను సవరించాలని జిల్లా కన్వీనర్ గంగపట్నం రమణయ్య పేర్కొన్నారు. నాయకులు వి వెంకటేశ్వర్లు, టి శ్రీనివాసులు, దేవినేని శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవాదుల రిలే నిరాహారదీక్ష

ఆంధ్రప్రదేశ్ హైకోర్టును అమరావతి నుంచి కర్నూలుకు తరలించాలన్న ప్రతిపాదనకు నిరసనగా నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు ఈనెల 14న కోర్టు విధులను బహిష్కరించి రిలే నిరాహారదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు వేనాటి చంద్రశేఖర్ రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఫణి రత్నం, రోజారెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు తన్నీరు కోటయ్య, షేక్ సలీం, సాల్మన్, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎర్ర దొంగలు అరెస్ట్..

నెల్లూరు జిల్లా రాపూరు సమీపంలోని వెలుగొండ అడవుల్లో రాపూరు-చిట్వేలి మార్గ మధ్యంలో ఉన్న పోతుగుంటమడుగు వద్ద అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న 13 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు వెంకటగిరి సిఐ అన్వర్ బాషా తెలిపారు. రాపూరు పోలీస్‌స్టేషన్లో ఈనెల 12న ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అందిన సమాచారం మేరకు పోతుగుంటమడుగు వద్ద 13 ఎర్రచందనం దుంగలతో పాటు షిఫ్ట్ కారును స్వాధీనం చేసుకున్నామని, అక్కడే వున్న ముగ్గురు స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. వీరంతా కడపజిల్లా రాజంపేట, బోయపల్లి, నెల్లూరుజిల్లా చింతపూడికి చెందిన వారని, వీరిని విచారించగా తిరుపతికి చెందిన సుబ్బారెడ్డి, కడపజిల్లా బోయపల్లికి చెందిన నరశింహులు ప్రమేయంతో స్మగ్లింగ్ చేసినట్లు చెప్పారని సీఐ తెలిపారు. వీరందరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్సై కోటిరెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## వాటర్ ప్లాంట్లపై దాడులు

నెల్లూరు జిల్లా ఆత్మకూరు మునిసిపల్ పరిధిలోని పలు వాటర్ ప్లాంట్లపై జిల్లా గెజిటెడ్ ఫుడ్ ఇన్స్పెక్టర్ బి. శ్రీనివాస్ ఈనెల 12 న దాడులు నిర్వహించారు. పట్టణంలోని జేఆర్ పేట, ఎల్ ఆర్ పల్లి, టెక్కెల పరిధిలోని వాటర్ ప్లాంట్లతో పాటు మండలంలోని పమిడిపాడు వాటర్ ప్లాంట్లను తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు బీఐయస్ సర్టిఫికెట్లు సరైన అనుమతులు లేకుండా వాటర్ ప్యాకెట్లు, బాటిల్స్ విక్రయించడం నేరమన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని ప్రాంతాల్లోని వాటర్ ప్లాంట్లను తనిఖీ చేస్తున్నామన్నారు. ఆత్మకూరు పట్టణంలో ఆరు ప్లాంట్లకే అనుమతులు ఉన్నాయని, మిగిలిన వాటికి లేవని గుర్తించినట్లు తెలిపారు. అంతేకాకుండా నీటిని సేకరించే విధానం అపరిశుభ్రంగా ఉండడంతో వారికి నోటీసులు జారీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌కు నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు.

## రేషన్ రాగులు స్వాధీనం

రేషన్ షాపులకు సరఫరా చేసే రాగులను రీసైక్లింగ్ చేసి వివిధ రకాల ప్యాకింగ్‌లతో బహిరంగ మార్కెట్టులో అధిక ధరలకు విక్రయాలు సాగించేందుకు ఎగుమతులు చేసే కేంద్రం గుట్టు రట్టు చేశారు. నెల్లూరు రూరల్ మండలం గుడిపల్లిపాడు వద్ద ఓ పిండి మిల్లులో ఎంతో కాలంగా అక్రమ వ్యాపారాన్ని సాగిస్తున్నారన్న సమాచారంతో ఈనెల 13న విజిలెన్స్ ఎస్పీ కేవిఎస్‌వీ సుబ్బారెడ్డి నేతృత్వంలో విజిలెన్స్ అధికారులు, పౌరసరఫరాల శాఖ అధికారులు గుడిపల్లిపాడులోని పిండిమిల్లుపై దాడి చేశారు. టాటా మ్యాజిక్ ఆటోలో తొలుత 15 బస్తాల రాగులను గుర్తించారు. పిండి మిల్లులో తనిఖీలు చేయగా 50 కేజీలవి 750 బస్తాలను గుర్తించారు. వీటి విలువ రూ.11.25 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి సేకరించిన రాగులను ఇక్కడికి చేరవేసి గుట్టు చప్పుడు కాకుండా ప్యాకింగ్ చేస్తున్నట్లు గుర్తించారు. పిండి మిల్లు యజమానిని, ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. స్వాధీనం చేసుకున్న రాగులను విజిలెన్స్ అధికారులు సివిల్ సప్లయిస్ అధికారులకు అప్పగించారు. విజిలెన్స్ సీఐ పీవీ నారాయణ, డీఎస్ఓ బాలకృష్ణారావు, ఏఎస్ఒ రవి పలువురు అధికారులు దాడుల్లో పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో..

## పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ట

కొండాపురం మండలంలోని తూర్పు ఎర్రబల్లి గ్రామంలో గ్రామస్తులందరూ కలసి ఈనెల 11న పోలేరమ్మ అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్టించి ఎంతో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, నైవేద్యాలు సమర్పించారు. శుక్రవారం నుంచి ఆదివారం దాకా మూడురోజుల పాటు అంగరంగవైభవంగా అమ్మవారికి ఉత్సవాలు నిర్వహించారు. ఈ విగ్రహ ప్రతిష్టాపనోత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. 40రోజులు పూజలు నిర్వహించిన తర్వాత పొంగళ్ళు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పిస్తామని గ్రామస్తులు తెలిపారు.

### మొక్కలు నాటండి..

## పర్యావరణం కాపాడండి

**- రైతు నాయకుడు కొరపాటి మురళీనాయుడు**



పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని, పచ్చదనాన్ని కాపాడుకుంటూ వాతావరణ కాలుష్యాన్ని నివారించుకోవాలని రైతు సంఘం జిల్లా నాయకుడు కొరపాటి మురళీనాయుడు అన్నారు. నెల్లూరు రూరల్ మండలంలోని అంబాపురం గిరిజన కాలనీలో ఆయన ఈనెల 13న మొక్కలు నాటారు. సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆ సమితి అధ్యక్షుడు సుధాకర్, కార్యదర్శి సురేష్ సింగ్ తదితరులు పాల్గొని మొక్కలు నాటారు.





## అభినయ్ - ఆస్మిత

దక్షిణ భారతదేశంలోనే పేరెన్నికగన్న వస్త్రాలయాలుగా ప్రసిద్ధిగాంచిన సౌత్ ఇండియా షాపింగ్ మాల్, ఆర్.ఎస్.బ్రదర్స్ వ్యవస్థాపకులు పొట్టి వెంకటేశ్వర్లు - వెంకట సుజాతల కుమారుడు **వెంకటసాయి అభినయ్ - ఆస్మిత పద్మనాభన్** (అంతర్జాతీయంగా ఖ్యాతి గడించిన బంగారు ఆభరణాల షోరూం... జిఆర్‌టి గ్రూప్ ఛైర్మెన్ జి.రాజేంద్రన్ - వాసంతి రాజేంద్రన్‌ల మనుమరాలు, జిఆర్ ఆనంద్ అనంతపద్మనాభన్ - స్వరూపల కుమార్తెల కల్యాణం అక్టోబర్ 13వ తేదీ చెన్నైలోని శ్రీ రామకృష్ణ కన్వెన్షన్ సెంటర్ నందు, రిసెప్షన్ అక్టోబర్ 16వ తేదీ హైదరాబాద్‌లోని హెచ్ఐసిసి నోవాటల్ నందు అంగరంగ వైభవంగా జరిగింది. రాజకీయ, సినీ, వ్యాపార, పారిశ్రామిక రంగాలకు చెందిన ప్రముఖులు ఈ వేడుకలకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. నవదంపతులకు 'లాయర్' శుభదీవెనలు.

# ప్రతి విద్యార్థికి.. వైయస్సార్ కంటి వెలుగు

**- ఆదాల ప్రభాకర్‌రెడ్డి**

వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఈ నాలుగు నెలల్లో చేపట్టిన కార్యక్రమాలలో వైయస్సార్ కంటి వెలుగు ఎంతో ప్రాధాన్యత వున్న కార్యక్రమమని నెల్లూరు పార్లమెంటుసభ్యులు ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నాడు. 16వ తేదీ ఆయన కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డితో కలిసి కోవూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో వైయస్సార్ కంటి వెలుగును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆదాల మాట్లాడుతూ కంటి చూపు మనిషికి చాలా ప్రధానమైనదని, కంటి పరీక్షలు చేయించుకోలేని పేద కుటుంబాల విద్యార్థులకు ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నాడు. ఈ పథకం క్రింద కంటి పరీక్షలు చేయడమేకాకుండా కంటి అద్దాలు కూడా ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నాడు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు



పి.కోటేశ్వరరెడ్డి, అబూబకర్, సుబ్బారెడ్డి, ఇక్బాల్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# మాట తప్పారు... మడమ తిప్పారు

**- జగన్‌పై సోమిరెడ్డి విమర్శ**

మాట తప్పం... మడమ తిప్పం అనే టైటిల్‌ను తన పేరు క్రింద పెట్టుకున్న ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్‌రెడ్డి, రైతులకిచ్చిన మాటతప్పి మడమ తిప్పారని మాజీమంత్రి, తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి విమర్శించాడు. 16వ తేదీ నెల్లూరులోని టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పిఎం కిసాన్ సమ్మాన్ పథకం ప్రకటన రాకముందే 2017లో రైతులకు 12,500రూపాయల పెట్టుబడి సాయం అందిస్తామని జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చాడని, నేడు మాట మార్చి కిసాన్ సమ్మాన్‌తో కలిపి ఆ డబ్బు ఇవ్వడం రైతులను మోసం చేయడమేనన్నాడు. రైతు భరోసాలో రాష్ట్ర సాయం 7,500రూపాయలకే పరిమితం చేశారని ఎద్దేవా చేశాడు. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో కిసాన్ సమ్మాన్ క్రింద 6వేలు, అన్నదాత సుఖీభవ క్రింద 9వేలు మొత్తం 15వేలు ఇవ్వాలని నిర్ణయించి ఉత్తర్వులు కూడా జారీ చేశామని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. కౌలురైతులకు కూడా 15వేలు ఇవ్వాలని తమ ప్రభుత్వ హయాంలోనే నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. రైతు భరోసా చివరకు రైతు నిరాశగా మారిందని, విడతల వారీగా రైతు సాయాన్ని అందించడం,



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

రైతు ఋణమాఫీల బకాయిలను వైసిపి రద్దు చేయడం రైతాంగాన్ని తీవ్ర నిరాశకు గురిచేశాయని ఆయన అన్నాడు. ఈ సమావేశంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర, మాజీ మేయర్ అబ్దుల్ అజీజ్, టిడిపి నాయకులు తిరుమల నాయుడు, ఉచ్చి భువనేశ్వరప్రసాద్, చేజర్ల వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తెరచుకున్న అండర్ బ్రిడ్జి

**• తప్పిన తిప్పలు**

గత రెండు నెలలుగా మూడో రైల్వేలైన్ బ్రిడ్జి నిర్మాణం కోసం మూసేసిన నెల్లూరులోని విజయమహల్ గేటు బాక్స్‌టైప్ బ్రిడ్జిని తిరిగి తెరిచారు. మూడో వంతెన పనులు పూర్తి కావడంతో బ్రిడ్జిలో తిరిగి వాహనాల రాకపోకలకు అవకాశం కల్పించారు. దీంతో ఈ దారిలో నిత్యం ప్రయాణించే వాహనదారులు వూపిరి పీల్చుకున్నారు. రెండు నెలలుగా ఈ బ్రిడ్జి మూసివేసి వుండడంతో రైల్వేగేటు వద్ద వాహనదారులు పడ్డ కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఒకే టైంలో రెండు, మూడు రైళ్ళు వెళ్లేటప్పుడు అరగంట నుండి గంటదాకా కూడా గేటు తెరిచేవాళ్ళు కాదు. ట్రాఫిక్ పూర్తిగా స్థంభించిపోయి వుండేది. ఎట్టకేలకు ఇప్పుడు ఆ బాధలు తప్పినట్లయ్యింది.




## సురక్షిత జలం.. సంపూర్ణ ఆరోగ్యం

# అమృతధార లక్ష్యం

**ఒకేరోజు ఆరుచోట్ల వాటర్‌ప్లాంట్లను ప్రారంభించిన విపిఆర్**

గ్రామసీమల్లో సరైన మంచినీటి వసతులు లేక అలమటించే ప్రజలకు సురక్షితమైన మంచినీళ్లందించి, వారి దాహార్తి తీర్చడమే 'విపిఆర్ అమృతధార' కార్యక్రమం ప్రధాన లక్ష్యమని రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నాడు.

ఈనెల 16వతేదీన జిల్లాలో ఆరుచోట్ల(ఓజిలి మండలం ఆర్మేనిపాడు, పెళ్లకూరు మండలం కుల్లూరు, కోట మండలం కొప్పుపాడు, బాలాయపల్లి మండలం ఊట్లపల్లి, అంబాలపూడి, రాపూరు మండలం చెర్లోపల్లి) విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విపిఆర్ అమృతధార కార్యక్రమం క్రింద ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్లను ఆయన ప్రారంభించాడు. ఓజిలి మండలం ఆర్మేనిపాడులో ఆర్‌ఓ వాటర్ ప్లాంట్ మరియు గ్రామ సచివాలయ భవనాన్ని తిరుపతి ఎంపి బల్లి దుర్గాప్రసాదరావు, సూళ్లూరుపేట శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్యలతో కలిసి ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రజలు కలుషిత నీరు త్రాగి రోగాలబారిన పడకుండా ఉండాలనే ఉద్దేశంతోనే విపిఆర్ ఫౌండేషన్ ద్వారా వాటర్‌ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పాడు. ఉదయగిరి నియోజకవర్గంలో ఫ్లోరిన్ సమస్య ఎక్కువుగా వుందని గుర్తించి, అక్కడ ఆర్‌ఓ ప్లాంట్లను ఎక్కువుగా పెట్టించినట్లు తెలిపాడు. పేదలకు సురక్షితమైన మంచినీళ్ళు అందించాలనే లక్ష్యంతో ఇప్పటివరకు 93వాటర్‌ప్లాంట్లను విపిఆర్ ఫౌండేషన్ ద్వారా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వాటర్‌ప్లాంట్లను ఏర్పాటు చేయడం ముఖ్యం కాదని, వాటిని జాగ్రత్తగా నిర్వహిస్తూ కాపాడుకోవాలని ఆయన పేర్కొన్నాడు.

అలాగే ఆయన సచివాలయ ఉద్యోగుల గురించి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.యస్. జగన్ ఆశయాలకు అనుగుణంగా మీరంతా పనిచేసి ప్రజల్లో నమ్మకం పెంపొందించుకోవాలని సూచించాడు.




ఓజిలి మండలం ఆర్మేనిపాడులో సచివాలయ ఉద్యోగులనుద్దేశించి మాట్లాడుతున్న ఎంపి విపిఆర్

## 'ప్రభా'తం

# సరికొత్త అధ్యాయం

**చెన్నై, మహాబలిపురం వేదికగా భారత్ ప్రధాని నరేంద్ర మోడీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌ల మధ్య జరిగిన చర్చలు ఫలప్రదమైనాయనే చెప్పుకోవచ్చు. భారతీయ సంస్కృతి సంప్రదాయాలను చైనా అధ్యక్షుడికి చూపిస్తూ, ఇరు దేశాల మధ్య వున్న చారిత్రాత్మక సంబంధాలను గుర్తు చేసేలా జిన్‌పింగ్ పర్యటన జరిగింది. ఇరు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు పెంపొందేలా ఒప్పందాలు జరిగాయి. చైనా-భారత్‌ల మధ్య నెలకొన్న అగాధాలను పూడుస్తూ, స్నేహసంబంధాలను పెంపొందించే ప్రయత్నాలలో ఇది తొలిమెట్టుగా భావించవచ్చు.**



ఒక ఊరిలో రామయ్య, సోమయ్య అనే ఇద్దరు రైతులున్నారు. ఊర్లో ఇద్దరివీ పక్కపక్క పొలాలు. రామయ్య పొలంలోని బోర్లలో నీళ్ళు పుష్కలంగా వుండేవి. సోమయ్య పొలంలో మాత్రం నీళ్ల పడేవి కావు. దీంతో రామయ్య తన బోర్లలో నుండే సోమయ్య పొలానికి కూడా నీళ్లిచ్చేవాడు. అందుకు కృతజ్ఞతగా సోమయ్య రామయ్య వూర్లో లేనప్పుడు ఆయన పొలం పనులు కూడా చూసుకుంటుండేవాడు. ఇలా పరస్పరం సహకరించుకోవడం వల్ల ఇద్దరి పొలాలలోనూ పంట చేతికొచ్చి ఇరు కుటుంబాల వాళ్ళు ఎంతో సంతోషంగా వుండేవాళ్ళు.

ఇద్దరు వ్యక్తులు పరస్పరం సహకరించుకుంటేనే ఎన్నో మంచి ఫలితాలు సాధించగలిగినప్పుడు.. రెండు ఇరుగుపొరుగు దేశాలు పరస్పరం సహకరించుకుంటూ సమన్వయంతో ముందుకు సాగితే ఇంకెన్ని ప్రయోజనాలు, ఇంకెన్ని అద్భుతాలు సాధించవచ్చు!

అదిగో అలాంటి వినూత్న ప్రక్రియకే అంకురార్పణ జరిగింది. ఆసియా ఖండంలోనే కాదు, ప్రపంచంలోనే రెండు పెద్ద దేశాల మధ్య సయోధ్యకు శ్రీకారం చుట్టబడింది. ఆర్థిక వ్యవస్థలోనూ, జనాభాలోనూ పెద్ద దేశమైన చైనాకు, ప్రపంచంలోనే పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌కు మధ్య వున్న అగాధాలను, అనుమానాలను తొలగించే విధంగా ఇరు దేశాధినేతల భేటీ ఎంతో విజయవంతంగా ముగిసింది.

చెన్నై, మహాబలిపురం వేదికగా భారత్ ప్రధాని నరేంద్ర మోడీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌ల మధ్య జరిగిన చర్చలు ఫలప్రదమైనాయనే చెప్పుకోవచ్చు. భారతీయ సంస్కృతి సంప్రదాయాలను చైనా అధ్యక్షుడికి చూపిస్తూ, ఇరు దేశాల మధ్య వున్న చారిత్రాత్మక సంబంధాలను గుర్తు చేసేలా జిన్‌పింగ్ పర్యటన జరిగింది. ఇరు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు పెంపొందేలా ఒప్పందాలు జరిగాయి. చైనా-భారత్‌ల మధ్య నెలకొన్న అగాధాలను పూడుస్తూ, స్నేహసంబంధాలను పెంపొందించే ప్రయత్నాలలో ఇది తొలిమెట్టుగా భావించవచ్చు. అయితే మహాబలిపురం వేదికగా విరిసిన స్నేహగీతం ఇకముందు ఎంతకాలం కొనసాగుతుందనే అనుమానాలూ లేకపోలేదు.

ప్రపంచంలో భారత్‌కు శత్రుదేశాలు ఏవైనా వున్నాయి అంటే అందులో మొదటిది పాకిస్థాన్ అయితే, రెండోది చైనా! స్వాతంత్ర్యం వచ్చాక భారతదేశం యుద్ధాలు చేసింది కూడా ఈ రెండు దేశాలతోనే! 1965లో చైనా మన దేశంపైకి దండెత్తి మానససరోవర్‌తో సహా కొంత భూభాగాన్ని ఆక్రమించుకోవడం తెలిసిందే! చైనాతో అప్పటి నుండి మనకు సత్సంబంధాలు లేవు. ఆసియా ఖండంలో తనకు భారత్ ఎక్కడ పోటీ వస్తుందోనని చైనా ఎప్పటికప్పుడు భారత్ వ్యతిరేక కార్యకలాపాలను ఎగదోస్తూనే వుంది.

ముఖ్యంగా అరుణాచల్‌ప్రదేశ్‌పై చైనా ఎప్పటినుండో కన్నేసి వుంది. ఇండియా మ్యాప్‌ను సైతం ఆ దేశం అరుణాచల్‌ప్రదేశ్ లేకుండా చూపిస్తుంటుంది. భారత్ మీద వ్యతిరేకతతోనే ఉగ్రదేశంగా రూపాంతరం చెందిన పాకిస్థాన్‌కు ఊతమిస్తోంది. ఆ దేశాన్ని ఆర్థికంగా నిలబెట్టే ప్రయత్నం చేస్తోంది. భారత్‌లో పాకిస్థాన్ చేస్తున్న ఉగ్రదాడులకు వెనుక చైనా ప్రోత్సాహం లేదని చెప్పలేము. వివాదాస్పదమైన పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో చైనా కారిడార్‌ను ఏర్పాటు చేసి భారత్‌తో వున్న వైరాన్ని మరింతగా చాటుకుంది. ఐక్యరాజ్య సమితి సమావేశంలో ప్రపంచ దేశాలన్నీ పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని దుయ్యబడితే, చైనా మాత్రం ఆ దేశాన్ని రక్షించుకునే ప్రయత్నం చేసింది. మసూద్ అజహర్‌ను అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించాలన్న ఐక్యరాజ్య సమితి తీర్మానాన్ని వ్యతిరేకించింది చైనానే! భారత్‌కు వ్యతిరేకంగా పాకిస్థాన్‌కు అనుకూలంగా చైనా తన ధోరణిని ఎప్పటికప్పుడు చాటుకుంటూనే వుంది.

గత ఐదేళ్లలో భారత ప్రధానిగా నరేంద్ర మోడీ ప్రపంచంలోని ప్రధాన దేశాలన్నీ చుట్టివచ్చాడు. అమెరికా, బ్రిటన్, ఐరోపా, సౌదీఅరేబియా, ఒమన్, అబుదాబి, మయన్మార్, దక్షిణాఫ్రికా, ఇజ్రాయిల్, ఫ్రాన్స్, జపాన్, జర్మనీ వంటి దేశాలతో స్నేహ సంబంధాలను మెరుగుపరిచాడు. అంతర్జాతీయ సమాజంలో భారత్ ప్రతిష్ట పెరిగింది. మోడీకి అంతర్జాతీయ నాయకత్వ గుర్తింపు వచ్చింది. ముఖ్యంగా భారత్ - అమెరికాల మధ్య సత్సంబంధాలు రోజు రోజుకీ మెరుగవుతున్నాయి. ఆసియా ఖండంలోనే భారత్ ఒక బలమైన శక్తిగా ఎదుగుతోంది. ఈరోజు ప్రపంచంలో అతిపెద్ద మార్కెట్ వ్యవస్థ భారత్‌లో వుంది. ఏ దేశమైనా భారత్‌తో సత్సంబంధాల కోసమే ప్రయత్నిస్తోంది.

భారత్ కూడా ఏ దేశంతో శత్రుత్వం కోరుకోవడం లేదు. పాకిస్థాన్‌తో వైరం అన్నది మనం కోరుకున్నది కాదు. పాకిస్థాన్ తనంతట తానుగా తెచ్చుకున్నదే! ఇరు దేశాల మధ్య కాశ్మీర్ సమస్య వున్నంతవరకు రెండు దేశాలు కూడా శత్రుదేశాలుగా వుండక తప్పదు.

కాని, చైనాకు భారత్‌తో శాశ్వత శత్రుత్వం అవసరం లేదు. ఈ రెండు దేశాల మధ్య వున్నది చిన్న అడ్డుగోడలే! ఉగ్రవాదానికి చేయూతనిస్తున్న పాకిస్థాన్‌ను చైనా దూరంగా పెట్టాలి. అలాగే భారత్ సరిహద్దుల విషయంలో తనకున్న అభ్యంతరాలను చైనా పక్కనపెట్టాలి. ఆ దేశం ఈ రెండింటిని వదులుకోగలిగితే భారత్‌తో మిత్రబంధం బలపడడం పెద్ద కష్టమేమీ కాదు. భారత్-చైనాల మధ్య యుద్ధాలు చేసుకునేంత శత్రుత్వం లేదు. ఒకరి ఆర్థిక వ్యవస్థను ఇంకొకకరు దెబ్బతీసుకోవాలనేంత పగలూ లేవు. రెండు దేశాలు కూడా ఇరుగు పొరుగు దేశాలు. శత్రుత్వం పెంచుకుని యుద్ధాలకు దిగితే ఇరు దేశాలకూ నష్టమే! స్నేహం పెంచుకుని వ్యాపార వాణిజ్య లావాదేవీలు పంచుకుంటే ఇరు దేశాలకూ ప్రయోజనమే!

# పేద విద్యార్థులకు 'సారంపాటి ఫండ్' చేయూత

నెల్లూరులోని శ్రీ సారంపాటి వీరన్నాచారి విశ్వబ్రాహ్మణ ఎడ్యుకేషన్ ఫండ్ పేద విద్యార్థులకు తన వితరణద్వారా ఎంతగానో చేయూతనిస్తోంది. ఈనెల 13న నెల్లూరులోని సావిత్రినగర్ 6వ వీధిలో ఉన్న కార్యదర్శి పి. దయానంద నివాసంలో ఈ ఫండ్ (విద్యానిధి) అధ్యక్షుడు ఇనుకొండ చక్రపాణి అధ్యక్షతన సమావేశం జరిగింది. 2019-20 విద్యాసంవత్సరంలో జిల్లాలో చదువుతున్న పేద విశ్వబ్రాహ్మణ విద్యార్థినీ విద్యార్థులు 97 మందికి 1,01,200 రూపాయలు ఆయా విద్యార్థులకు ఉచితంగా అందజేయాలని నిర్ణయించారు. ఇంటర్, డిగ్రీ, బిటెక్, ఎంసిఏ, ఎంబిఏ, ఎం.టెక్, పాలిటెక్నిక్, ఐటిఐ, ఐటిసి, డి.ఇడి చదువుతున్న విద్యార్థులకు ఈ ఆర్థిక చేయూతను అందిస్తూ ఆ మేరకు నిధిని మంజూరు చేశారు. ఈ సందర్భంగా దాతలు పి.జగదీష్, పి.వివేకానంద, శ్రీధర్‌బాబు-ధరణి, సుందరాచారి-శారదాంబ, కె.రామ సుబ్బమ్మ, పి.విమల, పి.సుగుణ, పుత్తేటి హర్షవర్ధన్-ఉమా మహేశ్వరి, దయానంద, వై.వెంకటేశ్వర్లు, ఎ.కరుణాకర్, ఇనుకొండ చక్రపాణి తమవంతు సాయంగా విరాళాలు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యానిధి కార్యవర్గ సభ్యులు మురుగళ్ళ చెంచురత్నం, కొండాచారి, ఇనుకొండ చక్రపాణి, వి.నారాయణరావు, పుత్తేటి హరికుమార్, ఆలూరు కరుణాకర్, పుత్తేటి దయానంద తదితరులు పాల్గొన్నారు.

### శ్రామికనగర్‌లో

# శ్రీ వెంకయ్యస్వామికి విశిష్ట పూజలు



నెల్లూరు రూరల్ పరిధిలోని శ్రామికనగర్‌లో అవధూత భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి మందిరంలో ఈనెల 14 నుంచి విశిష్టపూజలు జరుగుతున్నాయి. పెద్దసంఖ్యలో భక్తులు మందిరానికి విచ్చేసి శ్రీ వెంకయ్యస్వామిని దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. ఈనెల 14 నుంచి మందిరం 16వ వార్షికోత్సవాలు ప్రారంభం కావడంతో ఈ వేడుకలను నిర్వాహకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 14న అశ్వత్థ నారాయణ కల్యాణోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. స్వామివారికి విశేషాలంకరణలు చేశారు. అనంతరం మధ్యాహ్నం భక్తులందరికీ అన్నదానం చేశారు. మందిరం ధర్మకర్త నీరదమ్మ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ వేడుకలకు కిరణ్‌కుమార్-రమ్యశ్రీ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా భక్తుల భజనలు ఆకట్టుకున్నాయి.




## కాంగ్రెస్ రొచ్చు రాజకీయం

కాంగ్రెస్ రోజురోజుకీ దిగజారిపోతోంది. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో భేటీ సందర్భంగా మహాబలిపురం బీచ్‌లో ప్రధాని నరేంద్ర మోడీ వ్యర్థాలను ఏరివేసే వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఆ దృశ్యాలు ఎంతో స్ఫూర్తినిచ్చాయి. బీచ్‌లను, పరిసరాలను మనం పరిశుభ్రంగా వుంచుకోవాలనే ఆలోచనను రేకెత్తించాయి. కాని, కాంగ్రెస్, మోడీ వ్యతిరేకులు మాత్రం దీనినో పబ్లిసిటి స్టంట్‌గా సోషల్ మీడియాలో ప్రచారం చేయడం మొదలుపెట్టారు. ఒకవేళ అది పబ్లిసిటి స్టంట్ అనుకుందాం. దానివల్ల దేశానికేమన్నా నష్టం జరిగిందా? ఆ వీడియో వల్ల మంచి సందేశమే అందించారు గాని చెడిపొమ్మని చెప్పలేదు కదా! ఒక కూల్‌డ్రింక్ యాడ్ కోసం హీరోలకు కోట్లు ఇచ్చి చేస్తారు. ఆ యాడ్‌ను ఒక సామాన్యుడి చేత కూడా చేయించవచ్చు. కాని, ఆ యాడ్‌లో హీరో చేస్తేనే ఎఫెక్ట్ వుంటుంది. స్వచ్ఛభారత్ లాంటి కార్యక్రమాలు కూడా మోడీ లాంటివారు చేస్తున్న ఇలాంటి పనులతోనే విజయవంతమవుతాయి.

**మల్లి నారాయణ, డి.వి.సత్రం.**

## తీరని ఇసుక కష్టాలు

వై.యస్.జగన్మోహన్‌రెడ్డి అమలులోకి తెచ్చిన కొత్త ఇసుక పాలసీ విధానం గృహ నిర్మాణదారులకు చుక్కలు చూపిస్తోంది. మొన్నటివరకు ఇసుకకు ఇబ్బంది లేకుండా వుండింది. ఇప్పుడు ఇసుక కావాలంటే చాలా తలనొప్పులు ఎదురవుతున్నాయి. 'మీ సేవ'లో చలానా కట్టినా యార్డ్‌ల వద్ద 'నో స్టాక్' అంటున్నారు. ఇసుక అంతా ఇతర ప్రాంతాలకు అక్రమంగా తరలిపోతోంది. ముందు సీఎం దీనిపై పునరాలోచించి ఇసుక కష్టాలకు తెరదించాలి.

**సి.వి.కేశవ, నెల్లూరు.**

## ఎస్.ఐ తీరు మార్చుకోవాలి

నెల్లూరు సంతపేట ఎస్.ఐ ఫిర్యాదుదారులతో వ్యవహరిస్తున్న తీరు బాగాలేదు. సభ్యత, సంస్కారం లేకుండా మాట్లాడుతున్నాడు. కేసు పెట్టడానికి వచ్చిన ఫిర్యాదుదారులు, ముద్దాయిలను ఇద్దరినీ ఒకే గాటన కట్టేస్తున్నాడు. జిల్లా ఎస్పీ ఏమో ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటున్నారు. ఇలాంటి పోలీసుల వల్ల ఆ స్ఫూర్తి దెబ్బతింటుంది.

**పరమేశ్వరి సత్రం, నెల్లూరు.**

## రాష్ట్రపతి పాలన పెట్టాలి

పశ్చిమబెంగాల్‌లో శాంతిభద్రతలు నానాటికీ దిగజారిపోతున్నాయి. అక్రమ చొరబాటుదారుల ప్రాబల్యం పెరిగి హిందువుల మనుగడ ప్రశ్నార్థకమవుతోంది. కొన్ని ప్రాంతాలలో హిందువులు ప్రశాంతంగా పండుగలు జరుపుకునే పరిస్థితులు కూడా లేకుండా పోతున్నాయి. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ రాక్షస పాలన సాగిస్తోంది. హిందువులపై దాడులు చేయిస్తోంది. హత్యలు చేయిస్తోంది. పశ్చిమబెంగాల్‌లో ఎన్ఆర్‌సిని అమలు జరపాలి. అక్రమ చొరబాటు దారులను ఏరివేయాలి. అక్రమ చొరబాటు దారులకు ఈ దేశ పౌరులకంటే ఎక్కువ సౌకర్యాలు కల్పిస్తున్న మమతా బెనర్జీ ప్రభుత్వాన్ని రద్దు చేసి పశ్చిమబెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించాలి. అలా చేస్తే... హిందూ దేశంలో పుట్టి హిందువులను తక్కువ చేసేవాళ్ళకు చెంప పెట్టులా వుంటుంది.

**సి.రాజీవి, నెల్లూరు.**

# కలసి నడుద్దాం.. పార్టీని నిలబెడదాం

## నెల్లూరు పర్యటనలో చంద్రబాబు

2019 ఎన్నికల్లో ఘోరపరాభవం నుండి కోలుకున్న తెలుగుదేశం అధినేత, ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు మళ్ళీ పార్టీని నిలబెట్టే ప్రయత్నాలు మొదలు పెట్టాడు. మూడున్నర దశాబ్దాల రాజకీయ చరిత్రలో కలలో కూడా వూహించనంతటి దారుణ పరాభవాన్ని మొన్నటి ఎన్నికల్లో చవిచూడడం తెలిసిందే! ఈ ఓటమిని చంద్రబాబు అంత తొందరగా జీర్ణించు కోలేడనుకున్నారు. కాని, ఆయన ఎంతైనా 40ఏళ్ల సీనియర్ కదా... ఆ ఓటమి షాక్ నుండి తొందరగానే తేరుకున్నాడు. పార్టీ స్థితిగతులు, ఓటమికి దారితీసిన కారణాలపై జిల్లాల వారీగా సమీక్షలు ప్రారంభించాడు.

ఈ క్రమంలోనే ఈ నెల 14, 15 తేదీలలో నెల్లూరుజిల్లా పర్యటనకు విచ్చే శాడు. మినీబైపాస్‌లోని అనిల్ గార్డెన్స్‌లో రెండురోజుల పాటు 10 అసెంబ్లీ నియో జకవర్గాల సమీక్షా సమావేశాలు జరి గాయి. 14వ తేదీ వెంకటగిరి, ఉదయగిరి, సూళ్లూరుపేట, గూడూరు నియోజకవర్గాల





నాయకులు, కార్యకర్తలతో సమీక్ష నిర్వ హించగా, 15వ తేదీ నెల్లూరు నగరం, నెల్లూరు రూరల్, సర్వేపల్లి, కోవూరు, కావలి నియోజకవర్గాల సమీక్ష నిర్వ హించారు. ఈ సమీక్షల్లో ప్రధానంగా స్థానిక నాయకులపై కార్యకర్తలు ఫిర్యా దులు చేశారు. గతంలో ఎమ్మెల్యేలుగా, ఇన్‌ఛార్జ్‌లుగా వ్యవహరించిన వారి నిర్వాకం వల్లే పార్టీ నష్టపోయిందని పలు వురు ఆరోపించారు. పార్టీ అధికారంలో వుండగా పార్టీ జెండాలు మోసిన కార్య కర్తల బాధలను, వారి మంచిచెడ్డలను నాయకులు పట్టించుకోలేదని, ఇతర అవసరాల కోసం వైసిపి వాళ్లకు పనులు చేసిపెట్టారని, ఎలక్షన్‌ల టైంకు వాళ్ళు వాళ్ళ పార్టీకి వెళ్లిపోయారని తమ బాధంతా వెళ్లగక్కారు.

చంద్రబాబు మాత్రం పార్టీ కేడర్‌లో కొంత ధైర్యం నింపే ప్రయత్నం చేశారు. జీవితంలో ఎప్పుడూ పడనంత కష్టం, ఎన్నడూ చేయనన్ని పనులు గత ఐదేళ్ల పాలనాకాలంలో చేశానని, అయినా పార్టీకి 23సీట్లే రావడం తీరని ఆవేదనకు గురి చేసిందన్నారు. ఓటమికి కుంగిపోయేది లేదని, రెట్టించిన ఉత్సాహంతో పని చేద్దా మని, పార్టీని నిలబెడదామని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మన సత్తా చూపి ద్దామని ఆయన పిలుపునిచ్చారు. జగన్ ప్రభుత్వంపై ఆయన తీవ్రస్థాయిలో విమ ర్శలు చేశారు. అనుభవరాహిత్యంతో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తీసుకుం టున్న నిర్ణయాలు రాష్ట్రాభివృద్ధికి విఘా తంగా మారుతున్నాయని విమర్శించారు.

అనిల్‌గార్డెన్స్‌లో రెండురోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమంలో మాజీమంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఎన్.అమర్ నాథ్‌రెడ్డి, పి.నారాయణ, పరసారత్నం, టి.రమేష్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షులు బీద రవిచంద్ర, మాజీఎంపి పనబాక లక్ష్మి, మాజీ ఎమ్మెల్యేలు కంభం విజయరామిరెడ్డి, పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ, పాశం సునీల్, కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ జడ్పీఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్ర రెడ్డి, మాజీమేయర్ అజీజ్, నాయకులు పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి, వేనాటి రామచంద్రారెడ్డి, చేజర్ల వెంకటేశ్వరరెడ్డి, కిలారి వెంకటస్వామినాయుడు, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, టి.అనూరాధ, డాక్టర్ జడ్.శివప్రసాద్, ఆనం వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## నిండు కుండ...

# రైతుల పాలిట నీళ్ల కొండ

### పూర్తిస్థాయి సామర్థ్యానికి చేరిన సోమశిల

సమగ్ర సోమశిల స్వప్నం నెరవేరింది. సోమశిలలో 74టిఎంసీల పూర్తిస్థాయి సామర్థ్యంలో నీటిని చూడాలన్న కల నిజమైంది. నెల్లూరు జిల్లాలో వర్షాలు లేకపోయినప్పటికి కృష్ణానది వరదల పుణ్యమా అని సోమశిలలో 74టిఎంసీల పూర్తిస్థాయి నీటి మట్టం సాధ్యమైంది. దివంగత నేత డాక్టర్ వై.యస్.రాజశేఖరరెడ్డి హయాంలో ఒకసారి మాత్రమే సోమశిల రిజర్వాయర్‌లో 74టిఎంసీల నీళ్ళను చూడగలిగాము. ఇన్నేళ్ల తర్వాత మళ్ళీ ఆయన కుమారుడు వై.యస్.జగన్మోహన్‌రెడ్డి పరిపాలన కాలంలోనే సోమశిల మళ్లీ నిండు కుండలా దర్శనమివ్వడం విశేషం!

# మేలుకోకుంటే.. కోలుకోలేరు!

**దబ్బు ఎక్కువైనోళ్ళు తొందరగా చెడిపోవడానికి వున్న మార్గం జూదం, తాగుడు, క్లబ్‌లు, పబ్‌లు... ఇవన్నీ ఆర్థికంగా తొందరగా చితికిపోయేలా చేస్తాయి. మనిషిని శారీరకంగా చిక్కి శల్యమయ్యేలా చేసేది మాదకద్రవ్యాలు. హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై వంటి మహానగరాలలో డ్రగ్స్‌కు అలవాటుపడి యువత చాలా తొందరగా చెడిపోవడమే కాక తమ జీవితాలకు శాశ్వత సమాధులను నిర్మించుకుంటోంది.**

ఇటీవల నెల్లూరు నగరంలోని కొన్ని కార్పొరేట్ కళాశాలల్లో డ్రగ్స్ మాఫియా ఆనవాళ్ళు బయటపడడం తెలిసిందే! తమ కళాశాలల్లో చాలామంది విద్యార్థులు డ్రగ్స్‌కు బానిసలుగా మారిపోయి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్న సంఘటనలు వెలుగులోకి వచ్చాయి. ఈ సంఘటనలు విద్యార్థుల తల్లిదండ్రులకు ఓ హెచ్చరికలాంటివి. లక్షల్లో ఫీజులు కట్టి

### ○ డ్రగ్స్ మాఫియాపై జర జాగ్రత్త



తమ బిడ్డలను కార్పొరేట్ కాలేజీలలో చది విస్తున్నారు. విలాసవంతమైన బైక్‌లు కొనిస్తున్నారు. వేలకువేలు పాకెట్ మనీ క్రింద ఇస్తున్నారు. పుట్టినప్పటి నుండి వాళ్లను డబ్బు మధ్య పెంచుతున్నారు. కష్టం అనేది తెలియకుండా చేస్తున్నారు. చేతిలో ఎప్పుడు పడితే అప్పుడు డబ్బు వుంటున్నందువల్లే విద్యార్థుల ఆలోచనలు మారుతున్నాయి. తాత్కాలిక సుఖాన్నిచ్చే మద్యం, మత్తు పదార్థాల వైపు వారి దృష్టి మళ్లేలా చేస్తున్నాయి.

లక్షలు పెట్టి పిల్లలను కాలేజీలలో చేర్చగానే సరికాదు, ప్రతిరోజూ వారి నడవడికను గమనించాలి. ఎవరెవరితో తిరుగుతున్నారో గుర్తించాలి. వాళ్ళు తిరుగుతున్న స్నేహితులు ఎలాంటివాళ్లో తెలుసుకోవాలి. సాయంత్రమైతే మీ బిడ్డలు ఏ స్థితిలో ఇంటికొస్తున్నారో పరిశీలించాలి. కాలేజీ యాజమాన్యంతో కూడా నిత్యం టచ్‌లో వుండి, మీ బిడ్డల మంచిచెడ్డలు తెలుసుకుంటుండాలి. ఈ లోకంలో మత్తు పదార్థాలతో డబ్బులు సంపాదించాలను కునేవాళ్ళకు మంచిచెడులతో పనిలేదు. విద్యార్థుల భవిష్యత్‌తో అవసరం లేదు. అడ్డదారుల్లో డబ్బులు సంపాదించాలను కునే వాళ్ళు ప్రధానంగా వలవేసేది విద్యార్థులకే! ఆ వలకు తమ బిడ్డలు పడి పోకుండా చూసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రుల మీద వుంది.

# జిల్లాలో మరో 7 మున్సిపాల్టీలు

**రాష్ట్రంలోని 13జిల్లాల్లో కొత్తగా 50 మున్సిపాల్టీలను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అన్ని జిల్లాల్లోకెల్లా ఎక్కువుగా నెల్లూరుజిల్లాలో కొత్తగా ఏడు మున్సిపాల్టీలను ఏర్పాటు చేయనుంది.**

జిల్లాలో పెద్ద పట్టణంగా వున్న బుచ్చిరెడ్డిపాలెంను మున్సిపాల్టీగా ప్రకటించారు. వవ్వేరు పంచాయితీని కూడా దీనిలో విలీనం చేయనున్నారు. ఒకప్పుడు నియోజకవర్గం కేంద్రంగా వున్న అల్లూరును మున్సిపాల్టీని చేశారు. కోట, వాకాడు, గూడలి పంచాయితీలను కలిపి కోట మున్సిపాల్టీగా చేశారు.

అలాగే రాపూరు, పొదలకూరు కూడా మున్సిపాల్టీలు కానున్నాయి. పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న ముత్తు కూరును, తడను కూడా మున్సిపాల్టీలుగా మార్పు చేయనున్నారు. రేపు మున్సిపల్ ఎన్నికల్లో ఈ మున్సిపాల్టీలకు ఎన్నికలు నిర్వ హించనున్నారు.

ఇప్పటికే జిల్లాలో నెల్లూరు కార్పొరేషన్, గూడూరు, కావలి, ఆత్మకూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట మున్సిపాల్టీలు, నాయుడుపేట నగర పంచాయితీ వుండగా కొత్తగా మరో ఏడు మున్సిపాల్టీలు ఏర్పడనుండడంతో జిల్లాలో మున్సిపల్ ఎన్నికలు రసవత్తరంగా మారనున్నాయి.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

నెల్లూరు కబుర్లు

## ఒకేరోజు నెల్లూరులో
# ఇద్దరు అగ్రనేతలు





రాష్ట్రానికి చెందిన రెండు ప్రధానపార్టీల అగ్రనేతలు, ఒకరు ముఖ్యమంత్రి, ఇంకొకరు ప్రతిపక్ష నేత... ఒకేరోజు నెల్లూరు జిల్లాలో పర్యటించడం అధికార యంత్రాంగాన్ని ఉరుకులు పరుగులు పెట్టించింది. ముఖ్యంగా జిల్లా ఎస్పీ ఐశ్వర్య రస్తోగి సెలవులో వున్నప్పటికీ ప్రకాశం జిల్లా ఎస్పీ ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తూ ఇద్దరు నేతలకు పూర్తిస్థాయిలో బందోబస్తు కల్పించారు. ఈ నెల 14, 15తేదీలలో తెలుగుదేశం అధినేత చంద్రబాబు అనిల్ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన పార్టీ సమీక్షా సమావేశాల్లో పాల్గొనగా, ఎలాంటి లోటుపాట్లు లేకుండా పోలీసు యంత్రాంగం పటిష్ట చర్యలు చేపట్టింది. అలాగే 15వ తేదీ కాకుటూరు వద్ద విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన 'రైతు భరోసా' కార్యక్రమంలో ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్న కార్యక్రమాన్ని సైతం జయప్రదం చేయడంలో జిల్లా అధికార యంత్రాంగం, పోలీసులు సక్సెస్ అయ్యారు.

## మాగుంటకు జన్మదిన శుభాకాంక్షలు

ఒంగోలు లోక్‌సభ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి జన్మదినం సందర్భంగా 15వ తేదీ ఒంగోలులోని ఆయన నివాసంలో చిరంజీవి యువత రాష్ట్ర కార్యదర్శి కొట్టే వెంకటేశ్వర్లు కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పూలమాల, శాలువాతో మాగుంట శీనయ్యను సత్కరించారు.



## బాలుర క్రికెట్ టీమ్
# సెలక్షన్ కమిటి ఛైర్మెన్‌గా కోటారెడ్డి



జవహర్‌లాల్ నెహ్రూ టెక్నికల్ యూనివర్శిటీ పరిధిలోని ఇంటర్ యూనివర్శిటీ బాలుర క్రికెట్ టీం సెలక్షన్ కమిటి ఛైర్మెన్‌గా నెల్లూరుకు చెందిన న్యాయవాది, మాజీ రంజీ క్రికెట్ ఆటగాడు మలిరెడ్డి కోటారెడ్డిని నియమిస్తూ 15వ తేదీ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ నెల 21వ తేదీన గూడూరు ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో క్రీడాకారుల ఎంపిక జరుగనుంది. జెఎన్‌టియు పరిధిలోని ఇంజనీరింగ్ కళాశాలల నుండి సుమారు 300 మంది క్రికెట్ క్రీడాకారులు ఈ సెలక్షన్స్‌కు హాజరుకానుండగా, వారిలో 16 మందిని యూనివర్శిటీ క్రికెట్ టీంకు ఎంపిక చేయనున్నారు.

## ఇసుక పాలసీతో..
# పనులు లేక అవస్థలు

ప్రభుత్వం కొత్తగా తెచ్చిన ఇసుక పాలసీ విధానంతో వేలాదిమంది భవన నిర్మాణ కార్మికులు పనులు లేక రోడ్డున పడ్డారని, ప్రభుత్వం ఈ కార్మికులకు నెలకు 10వేల రూపాయల వంతున సాయం అందించి కార్మికులను ఆదుకోవాలని భవన నిర్మాణ కమిటీ నగర కార్యదర్శి శ్రీనివాసులు కోరారు. నెల్లూరులోని తడికల బజార్ సెంటర్ కూడలి వద్ద ఈనెల 14న ఆ కమిటీ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నూతన ఇసుక విధానం వల్ల కార్మికులు, కార్మిక కుటుంబాలు పనులు లేక అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే వీరిని ఆదుకోవాలని కోరారు. ఈ ధర్నాందోళనలో ఏలూరు భాస్కర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# గుడ్లు తినండి.. ఆరోగ్యం పొందండి
## - 'వరల్డ్ ఎగ్ డే'లో వక్తలు



కోడిగుడ్డులో బలవర్ధకమైన పోషక పదార్థాలున్నాయని, అత్యంత చౌకగా లభించేది, ఎవరూ కల్తీ చేయలేనిది గుడ్డేనని, ఆహారంగా వీటిని స్వీకరించడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని, ఎన్నో రకాలైన వ్యాధులను నివారించుకోవచ్చని వక్తలు పేర్కొన్నారు. ప్రపంచ గుడ్డు దినోత్సవం సందర్భంగా ఈనెల 11న నెల్లూరులోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నలుబోలు బలరామయ్యనాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వక్తలు గుడ్డు ప్రత్యేకతలను వివరించారు. బలరామయ్యనాయుడు మాట్లాడుతూ ప్రపంచ గుడ్డు దినోత్సవం నిర్వహించాలని తొలిసారిగా 1996లో ఐఐసి ఇంటర్నేషనల్ ఎగ్ కౌన్సిల్-వియన్నాలో నిర్ణయించారని, ప్రతి ఏటా అక్టోబర్ నెల 2వ శుక్రవారం ఈ కార్యక్రమం జరుగుతున్నదని చెప్పారు. ప్రపంచ ఆరోగ్యసంస్థ గుర్తించిన మధుమేహం, దృష్టిలోపం, ఎముకల వ్యాధులు, మతిమరుపు, వణుకు తదితర వ్యాధులను నివారించడంతో పాటు గుండె కండరాలు బాగా పనిచేసేందుకు అవసరమైన ప్రొటీన్లు కోడిగుడ్డులోని తెల్లసొనలో పుష్కలంగా ఉన్నాయన్నారు. క్రీడాకారులు, వాకర్స్ ప్రతిరోజూ రెండు గుడ్లు తిని ఆరోగ్యం కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ కోశాధికారి కొండూరు సుబ్బారావు, వాకర్స్ ఇంటర్నేషనల్ కౌన్సిలర్ బి.మనోహర్‌రెడ్డి, ఎస్.రాఘవేంద్రశెట్టి, వి. రంగారావు, జివి కృష్ణయ్య, బి.మారుతిరావు, వి.హజరత్‌బాబు, మాగంటి ప్రసాద్, బి.చెంచయ్య, కె. శివయ్య, శ్రీనాధరెడ్డి, ఎల్.శ్రీనివాసులు, డా.సూర్యనారాయణ, సోను తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఉడికించిన కోడిగుడ్లను ఉచితంగా వాకర్స్‌కు, క్రీడాకారులకు పంపిణీ చేశారు.

# ఎన్నాళ్లకెన్నాళ్లకు...



## ○ ప్రవహించిన పెన్నానది

నెల్లూరు సమీపంలోని పెన్నానదిలో ఇక ప్రవాహం కనిపించదేమో... పెన్నానదిని ఇప్పటికే చెత్తాచెదారాలతో నింపేశారు. గత ప్రభుత్వమైతే ఏకంగా నదీపరివాహక ప్రాంతంలోనే గృహసముదాయాలను నిర్మించింది. ఇక నదిలో నీళ్ళు ప్రవహించే పరిస్థితి లేదు కాబట్టి క్రమంగా పెన్నానది పూర్తిగా ఆక్రమణకు గురైనా ఆశ్చర్యం లేదు అనుకునే సమయంలో పెన్నానది ప్రవహించింది. నిర్మాణంలో వున్న బ్యారేజీని, పాత ఆనకట్టను దాటుకుని నీళ్ళు సముద్రం వైపుగా ప్రవహించాయి. శ్రీశైలం నుండి కృష్ణానది వరద జలాలను వదలడంతో పాటు అనంతపురం, కర్నూలు, కడప జిల్లాల్లో కురిసిన వర్షాల మూలంగా పెన్నానదికి వరదొచ్చింది. సోమశిల రిజర్వాయర్‌లో 75టిఎంసీల నీటి మట్టం చేరడంతో వరద నీళ్లను క్రిందకు వదలాల్సివచ్చింది. కాలువలకు వదలగా పోను మిగులు నీళ్ళు నెల్లూరు బ్యారేజీ వద్దకు చేరగా, ఇక్కడ కూడా సర్వేపల్లి, జాఫర్ సాహెబ్ కాలువలకు నీళ్ళు వదిలారు. అయినా కాలువలకు పోను ఇంకా వరద ప్రవాహం వుండడంతో ఆనకట్టను దాటుకుని సముద్రంవైపుగా నీళ్లు పారుతున్నాయి. దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డి హయాంలో పెన్నానది ఒకసారి పారింది. దాదాపు 15ఏళ్ల తర్వాత ఇన్నేళ్లకు వై.యస్.జగన్మోహన్‌రెడ్డి హయాంలో ఇంకోసారి పెన్నా ప్రవాహం ఆనకట్టను దాటింది. చాలాకాలం తర్వాత పెన్నానదిలో నీళ్ళు కనిపించడంతో నెల్లూరు జనం దానిని ఒక పండుగగా చూడడానికి ఎగబడ్డారు.

# పాలసేకరణ ధర పెంపు

జిల్లాలో వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా పాడి రైతుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని 10శాతం వెన్న గల గేదె పాలకు ఇప్పుడిస్తున్న ధరకంటే లీటర్‌కు రూపాయి పెంచి ఇవ్వాలని విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి నిర్ణయించారు. దీని ద్వారా జిల్లాలోని 140 పాల సొసైటీలు, 510 పాలసేకరణ కేంద్రాల పరిధిలోని 20వేల మంది పాడిరైతులకు ప్రయోజనం చేకూరనుంది. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి కోరుతున్నారు.

VIJAYA
Simply the Best

## హోంగార్డుల వేతనం
# పెంపుపై ఆనందం

రాష్ట్ర ప్రభుత్వం హోంగార్డ్ల దినసరి వేతనాన్ని 600 రూపాయల నుండి 710 రూపాయలకు పెంచడంపై హోంగార్డులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో హోంగార్డ్ల వేతనం పెంపుపై హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే ఆ హామీని నిలబెట్టుకున్నారు. పెరిగిన వేతనాల వల్ల జిల్లాలో 850మంది హోంగార్డులు ప్రయోజనం పొందనున్నారు.

## కార్పొరేట్‌కు
# అమ్ముడుపోయిన డిఇఓ

జిల్లా విద్యాశాఖాధికారి కార్పొరేట్ విద్యాసంస్థలకు అమ్ముడుపోయాడని ఏబివిపి నాయకులు విమర్శించారు. డిఇఓ కార్పొరేట్ విద్యాసంస్థలకు తొత్తుగా వ్యవహరిస్తున్నాడని ఆరోపిస్తూ ఏబివిపి నెల్లూరుజిల్లా విభాగం ఆధ్వర్యంలో 12వ తేదీ నెల్లూరు విఆర్‌సి సెంటర్‌లో ఆయన దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు దసరా సెలవుల్లో తరగతులు నిర్వహించినా డిఇఓ పట్టించుకోలేదని ఆరోపించారు. ఏబివిపి జిల్లా కన్వీనర్ మనోజ్‌కుమార్, రాజశేఖర్, సుధీర్, సాయికృష్ణ, లక్ష్మణ్, యశ్వంత్, భాను, శివ, రాజేష్ పాల్గొన్నారు.

## రంగనాధుని దర్శించుకున్న
# ఉత్తరాది మఠం పీఠాధిపతి

నెల్లూరు రంగనాయకులపేటలోని శ్రీ తల్పగిరి రంగనాథస్వామి వారి దేవస్థానాన్ని శ్రీ మద్వాచార్య మూల సంస్థాన ఉత్తరాది మఠం పీఠాధిపతి 1008 సత్యాత్మ తీర్థస్వామి ఈనెల 12న శిష్యబృందంతో కలిసి సందర్శించారు. పీఠాధిపతులకు దేవస్థానం కార్యనిర్వాహణాధికారి వేమూరి గోపి, ప్రధానాచార్యులు కిడాంబి జగన్నాథాచార్యులు స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల సన్నిధిలో పీఠాధిపతి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి శేష వస్త్రాన్ని పీఠాధిపతులకు ప్రధానార్చకులు అందజేశారు.

# అపార్ట్‌మెంట్లే... అడ్డాలు

## ● వ్యభిచార గృహాల నిర్వాహకుల కొత్త పంథా!

ఇంతకుముందు నగర శివార్లలో, జన సంచారం పెద్దగా లేని ప్రాంతాలలో వుండే భవనాలలో వ్యభిచార గృహాలను నిర్వహిస్తుండేవాళ్ళు. అయితే వాటి మీద నిఘా ఎక్కువ కావడం, పోలీసులు పసిగట్టి దాడులు చేస్తుండడంతో వ్యభిచార కేంద్రాల నిర్వాహకులు కొత్త పంథాను ఎంచుకున్నారు. జనావాసాల మధ్యే వ్యభిచార కేంద్రాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇందులో ఎక్కువగా అపార్ట్‌మెంట్లు వైపే మొగ్గుచూపుతున్నారు. వ్యభిచార కేంద్ర నిర్వాహకులు భార్యాభర్తలు మాదిరిగా అపార్ట్‌మెంట్‌లలో ఫ్లాట్లను బాడుగకు తీసుకుంటారు. ఆ తర్వాత సమీప బంధువులంటూ ఇతర ప్రాంతాల నుండి వేశ్యలను పిలిపిస్తారు. విటులు కూడా బంధువులు, మిత్రుల రూపంలోనే వస్తుంటారు. ఇలా కొంతకాలం గుట్టుచప్పుడు కాకుండా తమ కార్యకలాపాలు సాగించడం, ఆ తర్వాత కొంతకాలానికి ఇంకో అపార్ట్‌మెంట్‌కు మకాం మార్చడం చేస్తుంటారు. ఇటీవల ఆదిత్యనగర్, బాలాజీనగర్‌లలో ఇలాంటి కేసులు బయటపడడం తెలిసిందే! అపార్ట్‌మెంట్లలో ఫ్లాట్లను అద్దెకిచ్చేటప్పుడు యజమానులు అద్దెకు వచ్చిన వారి వ్యక్తిగత వివరాలపై పరిశీలన చేసి ఇస్తే ఇలాంటి వాటికి ఆస్కారం లేకుండా వుంటుంది.

## భారత ప్రతిష్టను విశ్వవ్యాప్తం చేస్తున్న..

# కారణజన్ముడు.. కార్యదక్షుడు.. మన వెంకయ్యనాయుడు



ఒక్క భారతదేశంలోనే కాదు యావత్ ప్రపంచమంతా వెంకయ్య తన ప్రతిభను చాటుతున్నాడు. బాగా తిరగడం ఆయనకు అలవాటు. క్షణం తీరిక లేని ప్రయాణాలంటే ఆయనకెంతో ఇష్టం. వీటన్నిటికంటే తన ప్రతి పర్యటనలోనూ భారతదేశ సంస్కృతి సంప్రదాయాల విశిష్టతను, భారతీయుల శాంతి తత్వాన్ని, భారతదేశ గొప్పదనాన్ని చెప్పడంపై ఆయనకు మక్కువ ఎక్కువ. అంతేకాదు, ఆయా దేశాలతో భారత్‌కు ఉన్న స్నేహ బంధాలను, దౌత్యపరమైన సంబంధాలను మరింత బలోపేతం చేస్తూ..భారత్‌ను ప్రపంచానికే మిత్రదేశంగా పరిచయం చేస్తూ..తద్వారా భారతదేశ కీర్తిపతాకను ప్రపంచవ్యాప్తంగా రెపరెపలాడిస్తున్నారాయన. ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టిన నాటినుండే వెంకయ్య భారతదేశమంతా తిరిగాడు. ఇప్పుడు యావత్ ప్రపంచాన్నీ చుట్టేస్తున్నాడు. భారత ఉపరాష్ట్రపతి అంటే ఎలా ఉండాలో భావితరాలవారికి ఒక సరికొత్త అర్థం చెప్తూ.. తన ప్రస్థానాన్ని సాగిస్తున్నాడు.

భారత ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు విదేశపర్యటనల్లోనూ తన అపారమైన ప్రజ్ఞాపాటవాలను, పరిణితిని చాటుకుంటూ, భారతదేశ ప్రతిష్టను మరింతగా ఇనుమడింపజేస్తున్నారు. ఆయా దేశాలతో భారత్‌కు దృఢమైన మైత్రిని పెంపొందిస్తూ అత్యద్భుతమైన రీతిలో అందరినీ ఆకట్టుకునేలా ప్రసంగాలు చేస్తూ ఆయా ప్రాంతాల ప్రజల ప్రశంసలను అందుకుంటున్నారు. భారత్ శాంతితత్వాన్ని, వసుధైక కుటుంబమనే భావనలను విశదీకరిస్తూ అందరి మన్ననలకు పాత్రమవుతున్నారు. ఇటీవల ఆఫ్రికాలోని సియెర్రా లియోన్ దేశంలోను, కమొరోస్ దీవుల్లో కూడా పర్యటించి అక్కడి ప్రజల ఆదరాభిమానాలను అందుకున్నారు. కమొరోస్ దీవులను సందర్శించిన తొలి భారత నాయకుడు ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడే కావడం విశేషం.



సియెర్రా లియోన్ అధ్యక్షుడు జూలియస్ మదాబయోతో సమావేశమైన వెంకయ్యనాయుడు

ఈనెల 13న సియెర్రా లియోన్ అధ్యక్షునితో వెంకయ్యనాయుడు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఐక్యరాజ్యసమితి భద్రతామండలిలో సంస్కరణల కోసం సంయుక్తంగా కలసి పనిచేయాలని ఇరు దేశాలు నిర్ణయించుకున్నాయి. ప్రపంచంలో సగం జనాభా ఆఫ్రికా, భారత్‌లలోనే ఉన్నప్పటికీ భద్రతామండలిలో మన వాణి వినిపించే అవకాశం దక్కడం లేదని, ఇకపై ఈ అంశంపై దృష్టిపెట్టాలని నిర్ణయించాయి. ఈ సందర్భంగా సియెర్రా లియోన్ అధ్యక్షుడు జూలియస్ మాదా బయో సమక్షంలో ఇరుదేశాల అధికారులు ఆరు ఒప్పందాలపై సంతకాలు చేసుకున్నారు కూడా. వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, సమాచార సాంకేతికత, మౌలికవసతుల అభివృద్ధి, సామర్థ్య నిర్మాణం తదితర అంశాల్లో సహకారానికి ఇరుదేశాలు సమ్మతించాయి. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు మాట్లాడుతూ సియెర్రా లియోన్‌తో భారత్‌కు ప్రత్యేకమైన, స్నేహపూర్వకమైన బంధం ఉందన్నారు. మహాత్మాగాంధీజీ 150వ జయంతి సందర్భంగా ప్రత్యేక స్టాంప్‌ను విడుదల చేసిన సియెర్రా లియోన్ అధ్యక్షుడు జూలియస్ మాదా బయోకు ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు తన కృతజ్ఞతలు తెలియజేశారు.

### సహనం..భారతీయ విధానం :

తొలుత 12వ తేది రాత్రి ఫ్రీటౌన్‌కు చేరుకున్న భారత ఉపరాష్ట్రపతికి అక్కడ ఘనస్వాగతం లభించింది. ఫ్రీటౌన్‌లో భారత సంతతి ప్రజలతో జరిగిన సమావేశంలో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు మాట్లాడుతూ సహనం భారతీయ విధానమని అన్నారు. అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో మైనార్టీలతో సహా అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. జమ్ము కశ్మీర్ విషయాన్ని కూడా ప్రస్తావిస్తూ జమ్ముకశ్మీర్ ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగమేనని, అక్కడ సీమాంతర ఉగ్రవాదానికి అడ్డుకట్ట వేసేందుకే కేంద్ర ప్రభుత్వం 370 అధికరణను రద్దు చేసిందని స్పష్టం చేశారు.

## కమొరోస్‌లో వెంకయ్యకు

## అత్యంత ప్రతిష్టాత్మకమైన పురస్కారం



'ది కమాండర్ ఆఫ్ ది గ్రీన్ క్రెసెంట్' పురస్కారాన్నందుకుంటున్న ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

భారత ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఇటీవల కమొరోస్ దీవుల్లో పర్యటించిన సందర్భంగా ఆ దేశపు అత్యంత ప్రతిష్టాత్మకమైన 'ది కమాండర్ ఆఫ్ ది గ్రీన్ క్రెసెంట్' పురస్కారాన్ని ప్రదానం చేయడం ఎంతో విశేషం. అంతేకాదు, ఆ దేశపు పార్లమెంట్‌కు వారు వెంకయ్యనాయుడును ఆత్మీయంగా ఆహ్వానించి ప్రత్యేక సభాస్థలంలో ప్రసంగించే అరుదైన గౌరవాన్ని కూడా కలిగించారు. తొలుత, కమొరోస్ రాష్ట్రపతి అజాలి అస్సోమని, ఆయనతో పాటు క్యాబినెట్ సభ్యులంతా విమానాశ్రయానికి వచ్చి ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడును ఎంతో సాదరంగా ఆహ్వానించడం, అక్కడి ప్రజలు కూడా వెంకయ్యనాయుడును ఒక సహోదరునిగా భావిస్తూ గౌరవించడం ఒక అపురూపమైన ఘట్టమనే చెప్పవచ్చు. ఈ సందర్భంగా వెంకయ్య తన ప్రసంగంలో హిందూ మహా సముద్రాన్ని ఒక స్నేహసముద్రంగా అభివర్ణించి కమొరోస్ ప్రజల మనసులను ఎంతగానో ఆకట్టుకున్నారు. వెంకయ్య నాయుడు ప్రసంగిస్తున్నంతసేపు కమోరియన్ పార్లమెంట్ భవనం కరతాళధ్వనులతో మార్మోగిపోయింది. ఈ పర్యటనల వల్ల కమొరోస్ దీవులు భారతదేశవాసులకే కాక ప్రపంచదేశాలన్నిటి దృష్టిని ఆకర్షించాయి. కమొరోస్ దీవులకు భారతదేశానికి మధ్య ఒక మంచి స్నేహ వారధి ఏర్పడి, మన దేశ ఔన్నత్యంపై ఆఫ్రికావాసుల హృదయాల్లో విశేషమైన స్థానం లభించింది. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు తన ప్రసంగంలో 'వసుధైక కుటుంబం' ప్రస్తావన తెచ్చి వివరించిన తీరు ఆఫ్రికావాసులను బాగా ఆకట్టుకుంది. అది వారి నుంచి అద్భుతమైన ప్రతిస్పందన కలిగించింది కూడా. ఈ చరిత్రాత్మక పర్యటనలతో మన వెంకయ్యనాయుడు కొమొరోస్ ప్రజల మనసుల్లో భారతీయులకు అద్వితీయ స్థానం సంపాదించి ఒక సువర్ణాధ్యాయానికి అంకురార్పణ చేయడం గొప్ప విశేషం.

## ఉదయగిరిని జిల్లా చేయాలి - ఆదాలకు విజ్ఞప్తి



ఉదయగిరిని జిల్లా చేయాలంటూ ఎంపి ఆదాలను కోరుతున్న ఉదయగిరి జిల్లా సాధన సమితి సభ్యులు

ఉదయగిరిని జిల్లాగా ప్రకటించేందుకు మీ సహకారం కావాలని ఉదయగిరి జిల్లా సాధన సమితి సభ్యులు 13వ తేదీ నెల్లూరు పార్లమెంట్ సభ్యులు ఆదాల ప్రభాకర్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. అన్ని విధాలుగా వెనుకబడిన ఉదయగిరిని జిల్లాగా ప్రకటిస్తేనే ఈ ప్రాంతం అభివృద్ధి చెందడానికి అవకాశముంటుందని సభ్యులు ఆదాల ప్రభాకర్‌రెడ్డికి వివరించారు. ఈ విషయంలో తనవంతు సహకారం వుంటుందని, దీనిపై ముఖ్యమంత్రితో కూడా మాట్లాడుతానని ఈ సందర్భంగా సభ్యులకు ఆదాల హామీ ఇచ్చారు. ఆదాలను కలిసిన వారిలో డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, కె.శ్రీనివాసులురెడ్డి, ఫరూక్ ఆలీమహ్మద్, ఖాజా గౌస్‌బాషా, మల్లు సుధాకర్‌రెడ్డిలు వున్నారు.

## శ్రీసిటీలో ఐఎంఓపి ప్లాంట్ విస్తరణ

శ్రీసిటీలోని జపాన్‌కు చెందిన ఇండియా మెటల్‌వన్ స్టీల్‌ప్లేట్ ప్రాసెసింగ్ ప్రైవేట్ లిమిటెడ్(ఐఎంఓపి) పరిశ్రమ ఉత్పత్తి కేంద్రం విస్తరణ కార్యక్రమం ఈనెల 14న నిర్వహించింది. ఆ పరిశ్రమ ఎం.డి తకేషుషి హిరాయ్ నూతన ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభించగా, శ్రీసిటీ ఫౌండేషన్ ప్రెసిడెంట్ రమేష్ సుబ్రహ్మణ్యం, ఐఎంఓపి కస్టమర్ కంపెనీల ప్రతినిధులు, శ్రీసిటీ సీనియర్ అధికారులు పాల్గొన్నారు. శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ ఈ ప్లాంట్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 24వేల టన్నులు కాగా ఇప్పుడు విస్తరణతో దీని సామర్థ్యం 35 శాతం పెరుగుతుందని, ఇప్పటిదాకా ఈ పరిశ్రమంలో 500 మంది పనిచేస్తుండగా, మరో 100 మందికి ఉద్యోగాలు లభిస్తాయన్నారు. కంపెనీ విస్తరణతో ఈ ప్రాంతంలో ఆర్థికవృద్ధి పెరుగుతుందని సంతోషం వ్యక్తం చేశారు.




శిలాఫలకాన్ని ఆవిష్కరించిన తకేషి హిరాయ్



# కళ్యాణ వైభవం...!




నెల్లూరుజిల్లా టెలికాం బోర్డు మెంబరు కిలారి శ్రీనివాసులునాయుడు - సుజాతల కుమార్తె **దీపిక - కార్తీక్** (నెల్లూరు వాస్తవ్యులు చెరుకూరు శ్రీనివాసులునాయుడు - విజయలక్ష్మిల కుమారుడు)ల కల్యాణం అక్టోబర్ 9వ తేదీ నెల్లూరులోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో వైభవంగా జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.




నెల్లూరుజిల్లా గూడూరు మండలం, చెన్నూరు గ్రామ వాస్తవ్యులు చిరమన నాగేంద్రకుమార్ - ప్రభావతిల కుమారుడు **శ్రావణ్‌కుమార్ - లక్ష్మి** (నెల్లూరుజిల్లా సూళ్లూరుపేట మండలం కోటపోలూరు గ్రామ వాస్తవ్యులు కందుకూరు సుబ్రహ్మణ్యం - అమ్ములుల కుమార్తె)ల పెళ్లి అక్టోబర్ 10వ తేదీ గూడూరు సిఆర్ రెడ్డి కళ్యాణ మండపం నందు వైభవంగా జరిగింది. నూతన జంటకు 'లాయర్' శుభాశీస్సులు.

### యురేనియం తవ్వకాలతో

# నీళ్ళు కలుషితం

**- జనసేన మనుక్రాంత్**



డ్రిల్లింగ్ చేసిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న మనుక్రాంత్

యురేనియం అన్వేషణలో భాగంగా డ్రిల్లింగ్ జరుపుతున్నారని మీడియాలో వార్తలు వచ్చిన నేపథ్యంలో జనసేన రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటి సభ్యులు చెన్నారెడ్డి మనుక్రాంత్ ఈ నెల 13వ తేదీన అనంత సాగరం మండలం పడమటి కంభంపాడులో పర్యటించాడు. అక్కడ తవ్వకాలను ఆయన పరిశీలించాడు. ఈ సందర్భంగా మనుక్రాంత్ మాట్లాడుతూ గత ఆరునెలలుగా భారీ యంత్రాలతో ఇక్కడ 8 టెస్టింగ్ హోల్స్ చేశారని, స్థానిక ప్రజల వ్యతిరేకతతో డ్రిల్లింగ్ చేస్తున్న మ్యాప్ కంపెనీ యాజమాన్యం యంత్రాలను తరలించిందన్నారు. యురేనియం మార్కెట్‌లో తక్కువ ధరకు లభిస్తుండగా పంట పొలాలకు నీళ్లందించే సోమశిల డ్యాం దగ్గరలో తవ్వకాలు జరపాల్సిన అవసరం ఏముందని, ఈ తవ్వకాల వల్ల సోమశిల జలాలు కలుషితమవుతాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు.

## మల్లాం చెరువు కలుషితం కాకుండా చూడాలి

నెల్లూరు జిల్లా చిట్టమూరు మండలంలోని మల్లాం చెరువులోకి రొయ్యల గుంతల నుంచి కలుషిత నీటిని రానివ్వకుండా అడ్డుకుని రైతులను ఆదుకోవాలని గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాదరావు అధికారులకు సూచించారు. మల్లాంలో ఎమ్మెల్యే అధ్యక్షతన ఈనెల 12న ఇరిగేషన్, ఫిషరీస్, విద్యుత్, గ్రౌండ్‌వాటర్, రెవెన్యూ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు జిల్లా స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రొయ్యల గుంతల నుంచి మల్లాం చెరువుకు కలుషిత నీరు చేరడంతో గత ఆరేళ్ళుగా పంటలు పండక మల్లాం రైతులు ఇబ్బందులు పడుతున్నారని స్థానిక నాయకులు ఎమ్మెల్యే దృష్టికి పంచాయితీ తరపున విజ్ఞప్తి చేశారు. దీంతో ఎమ్మెల్యే ఇరిగేషన్ మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్‌ను తీసుకొచ్చి మల్లాం చెరువు దుస్థితిని చూపించారు. స్పందించిన మంత్రి వెంటనే చెరువులోకి రొయ్యల గుంతల కలుషిత నీరు వదిలేవారికి నోటీసులు అందజేసి, చెరువులోకి ఆ నీరు రాకుండా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. వైయస్సార్ సీపీ నాయకులు చెన్నారెడ్డి బాబురెడ్డి, దేవారెడ్డి సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్ వార్తలు

## చంద్రబాబుకు ఘనస్వాగతం



టిడిపి నాయకులు, కార్యకర్తలకు అభివాదం చేస్తున్న చంద్రబాబునాయుడు

తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు జిల్లాలో రెండు రోజుల పర్యటనలో భాగంగా ఈనెల 14న గూడూరు పట్టణం సమీపంలోని జాతీయ రహదారి వద్ద మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. టిడిపి నాయకులు పనబాక కృష్ణయ్య, తానంకి నానాజీ, జడ్పీ మాజీ ఛైర్మెన్ చెంచలబాబుయాదవ్, నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్దఎత్తున మేళతాళాలతో తమ నేతకు నీరాజనాలు పలికారు. ఎన్నికల అనంతరం తొలిసారిగా చంద్రబాబునాయుడు ఇక్కడికి రావడంతో అభిమానులు పూలవర్షం కురిపించారు. పుష్పగుచ్ఛాలు అందించి శాలువాలతో సత్కరించారు. గూడూరు డిఎస్పీ భవాని శ్రీహర్ష, పట్టణ సిఐ దశరధరామారావు, ఎస్ఐలు బ్రహ్మనాయుడు, పుల్లారావు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

## గూడూరు సబ్‌కలెక్టర్‌గా గోపాలకృష్ణ బాధ్యతల స్వీకరణ



గూడూరు సబ్ కలెక్టర్‌గా రోణంకి గోపాలకృష్ణ ఈనెల 14న తన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ సబ్‌కలెక్టర్‌గా ఉన్న ఆనంద్ బదిలీపై పోలవరం ప్రత్యేక అధికారిగా వెళ్ళారు. కడప జిల్లాలో ట్రైనీ సబ్‌కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న గోపాలకృష్ణను ప్రభుత్వం గూడూరు సబ్ కలెక్టర్‌గా నియమించింది. ఈ సందర్భంగా గూడూరు డివిజన్‌లోని పలువురు తహశీల్దార్లు, రెవెన్యూ అధికారులు, అసోసియేషన్ నాయకులు కొత్త సబ్‌కలెక్టర్‌ను గౌరవపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛాలు అందించారు. అనంతరం సబ్ కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వారి సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

## గుర్తింపుకార్డులకు దరఖాస్తు చేసుకోండి

**- రోడ్డుమార్జిన్ వ్యాపారులకు మునిసిపల్ కమిషనర్ సూచన**



గూడూరు పట్టణంలోని రోడ్డుమార్జిన్ వ్యాపారులు గుర్తింపుకార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని మునిసిపల్ కమిషనర్ ఓబులేసు అన్నారు. గూడూరు మునిసిపల్ కార్యాలయంలో ఈనెల 12న ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్ళుగా ఇక్కడ రోడ్డుపై వ్యాపారాలు చేసుకుంటున్నా, వారికి సరైన గుర్తింపు లేక ఇబ్బందులు పడుతున్నారని, వారికి గుర్తింపు కార్డులు అందజేస్తామని తెలిపారు. అర్హులైనవారు తమ వివరాలను మునిసిపల్ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెప్మా సిఓ చందన, అధికారులు పాల్గొన్నారు.

## నవరత్నాలు - పేదలందరికీ ఇళ్ళు

గూడూరు పురపాలక సంఘ పరిధిలోని 'నవరత్నాలు - పేదలందరికీ ఇళ్ళు'కి సంబంధించి వార్డు సభలను 16వ తేదీ ప్రారంభించడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ ఓబులేసు తెలిపారు. 16వ తేదీన 1 నుంచి 8వ వార్డు వరకు పట్టణంలోని జడ్పీ పాఠశాల ప్రాంగణంలో, 17వ తేదీ 9 నుంచి 17వ వార్డు వరకు పట్టణంలోని షాదీ మంజిల్‌లో, 18వ తేదీ 18వార్డు నుంచి 22వ వార్డు వరకు ఎస్ఎంజి పాఠశాల ప్రాంగణంలో సభలు జరుగగా, 19వ తేదీ 23 నుంచి 27వ వార్డు వరకు రెండో పట్టణం మాలవ్యానగర్ వాటర్ ట్యాంకు వద్ద, 21వ తేదీ 28వ వార్డు నుంచి 33వ వార్డు వరకు రెండో పట్టణం దిగువ వీరారెడ్డిపల్లెలోని జిఎస్ఆర్ పురపాలక పాఠశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు కమిషనర్ తెలియజేశారు. ఆయా వార్డులకు సంబంధించిన ప్రజలు తమ వార్డుల పరిధిలో నిర్వహించే వార్డు సభల్లో పాల్గొని ఇళ్ళకు సంబంధించి సమస్యలను తెలియపర్చవచ్చని చెప్పారు.



ఈ నెల 14వ తేదీ రావులపాలెంలో త్రిరత్న బుద్ధ విహార్ వారు నిర్వహించిన కార్యక్రమంలో 40ఏళ్ళుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు విశేష సేవలందించినందుకు గాను అరవ పార్వతయ్యను డా॥ బి.ఆర్.అంబేద్కర్ ఫెలోషిప్ అవార్డుతో సత్కరిస్తున్న మాజీమంత్రి గొల్లపూడి సూర్యారావు, రెడ్డి సుబ్రహ్మణ్యం, డా॥ ప్రదీప్ ఆగ్గల్ తదితరులు

# బడుల బాగు కోసం దృష్టి సారించిన కలెక్టర్

- జిల్లాలో వినూత్నంగా 'మన బడి-మన బాధ్యత'కు శ్రీకారం
- సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్ట్ అధికారి వి.బ్రహ్మానందరెడ్డి వెల్లడి

జిల్లాలో బడుల బాగుకోసం జిల్లా కలెక్టర్ ఎం.వి శేషగిరిబాబు కృషి ప్రారంభించారు. ఆ మేరకు జిల్లాలో వినూత్నంగా 'మన బడి-మన బాధ్యత' అనే కార్యక్రమం ఈనెల 14న ప్రారంభమైంది.

జిల్లా కలెక్టర్ సూచనలతో ఆరంభమైన ఈ వినూత్న కార్యక్రమంలో భాగంగా సంబంధిత అధికారులు పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకుని విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు, నాణ్యమైన విద్యను బోధించేందుకు ఏమిచేయాలో తగు నివేదికలు రూపొందిస్తారు. ప్రతి మంగళ వారం, శుక్రవారం రోజుల్లో పాఠశాలలను సందర్శించి అన్ని విషయాలను పరిశీలిస్తారు.

ఈనెల 13న నెల్లూరు దర్గామిట్టలోని కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్ట్ అధికారి వి.బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ కలెక్టర్ సూచనల మేరకు జిల్లాలోని 3419 పాఠశాలల్లో ఈ వినూత్న కార్యక్రమం అమలు చేయనున్నామన్నారు. డిఇఓ జనార్దనాచార్యుల సహకారంతో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. తొలిరోజు కావలి డివిజన్‌లోని దగదర్తి, బోగోలు మండలాల్లో ఈ కార్యక్రమం ప్రారంభమవు తుందని, సంబంధిత అధికారులు పాఠశాలలో ప్రార్థనా సమయాని కన్నా ముందుగానే వచ్చి, మధ్యాహ్నం వరకు పాఠశాలలోనే ఉండి ప్రతి అంశాన్ని పరిశీలిస్తారన్నారు. విద్యార్థులతోపాటే మధ్యాహ్నభోజనం చేసి ఆహార నాణ్యతను పరిశీలిస్తారని, ఆ తర్వాత మరో పాఠశాలకు వెళ్ళి అక్కడ సాయంత్రం వరకు ఉండి పాఠశాలలో చదువుల తీరుతెన్నుల పట్ల విద్యార్థులతోను, విద్యార్థుల తల్లిదండ్రులతోను మాట్లాడతారన్నారు.

పాఠశాలల్లో విద్యార్థుల హాజరు ఎలా ఉంది, వారి మార్కులు ఎలా ఉంటున్నాయి, పాఠశాలల్లో మౌలిక వసతులు, పాఠ్య ప్రణాళికలు, క్రీడలు, మరుగుదొడ్ల నిర్వహణ ఇలా అన్ని అంశాల పట్ల అధికారులు అన్ని కోణాల్లోనూ పరిశీలించి స్వయంగా విద్యార్థులతోను, ఉపాధ్యాయులతోను కలిసి సంప్రదించి తగు నివేదికను రూపొందించి ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నదే ఈ కార్యక్రమం ఉద్దేశ్యమని బ్రహ్మానందరెడ్డి వివరించారు.

# గ్రామీణ వైద్యులపై దాడులు దారుణం

**- వైఎస్సార్ ఆర్ఎంపి అసోసియేషన్ నాయకుల ఆవేదన**

గ్రామీణ వైద్యులపై దాడులు దారుణమని, పనిగట్టుకుని చిన్న కారణాలతో తమపై వైద్యశాఖ అధికారులు దాడులు చేస్తున్నారని, ఈ దాడులను ఆపేలా చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ ఆర్ఎంపి అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.మహేష్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈనెల 14న ఆయన నెల్లూరులోని ఎమ్మెల్యేలు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, ఆనం రామనారా యణరెడ్డిలను కలుసుకుని ఆమేరకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మహేష్‌రెడ్డి మాట్లాడుతూ 50ఏళ్లుగా ఎలాంటి గుర్తింపు లేకుండా పల్లెల్లో వైద్యసేవ లందిస్తున్న తమను దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి గుర్తించారని, తమకు శిక్షణ కూడా ఇప్పించి సర్టిఫికెట్ ఇప్పించారని గుర్తుచేశారు. ఆయన కుమారుడు ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కూడా ఆయన తండ్రిలాగే తమకు కూడా గుర్తింపు ఇస్తామని, శిక్షణ కూడా ఇప్పిస్తామని పాదయాత్రలో చెప్పారని పేర్కొన్నారు. తక్కువ ఖర్చుతో వైద్యం చేస్తున్న తమపై వైద్యశాఖ అధికారులు దాడులు చేయడమే కాకుండా దూషి స్తున్నారని, క్లినిక్‌లను సీజ్ చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పల్లెల్లో పూట గడవని ఆర్ఎంపిలు కూడా ఉన్నారని, అలాంటి తమ నుంచి శానిటేషన్, పొల్యూషన్, రిజిస్ట్రేషన్, బయో వేస్ట్ మేనేజ్‌మెంట్ వంటి పలురకాల సర్టిఫికెట్లు లేవంటూ క్లినిక్‌లు సీజ్ చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. మూసివేసిన క్లినిక్‌లను తిరిగి ప్రారంభించు కునేందుకు అనుమతివ్వాలని కోరారు. ఈ విషయమై స్పందించిన ఎమ్మెల్యేలు అధికారులతో సంప్రదించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అసోసియేషన్ నాయకులు పద్మారెడ్డి, రత్నం, నాగేశ్వరరావు, నజీరుద్దీన్, గోవర్ధన్, నారాయణరెడ్డి, ఏవి రమణయ్య పాల్గొన్నారు.

# రామభక్తుడిగా మారిన జిన్‌పింగ్

**శ్రీను గల్పిక**

చెన్నైలోని తాంబరం విమానా శ్రయం. విమానం స్టాపింగ్ పాయింట్ వద్ద తమిళనాడు గవర్నర్ బన్వర్‌లాల్ పురోహిత్, ముఖ్యమంత్రి పళనిస్వామి, ఉపముఖ్యమంత్రి పన్నీర్ సెల్వం, డిఎంకె అధినేత స్టాలిన్, ఇంకా పలువురు మంత్రులు వరుసగా నిలబడివున్నారు. అందరూ తెల్లచొక్కా, తెల్లపంచెలు ధరించి భుజాల మీద టవల్స్ వేసుకుని వున్నారు. నుదుటన పెద్దపెద్ద బొట్లు పెట్టివున్నారు. అంతలో 'ఎయిర్ చైనా' బోయింగ్ విమానం ల్యాండయ్యింది. అందులో నుండి చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ దిగాడు. ఆయన దిగడంతోటే తమిళనాడు నాయకు లందరూ వరుసగా ఆయనకు బొకేలిచ్చి కాళ్లమీద పడిపోయారు. జిన్‌పింగ్ ఆ సంఘటనకు బిత్తరపోయి తన పక్కనేవున్న భారత రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో... ఇదేం పనయ్యా... కాళ్ళ మీద పడడం ఏంటని అడిగాడు. అందు కాయన... మా వాళ్ళందరికీ జయలలిత అలా అలవాటు చేసి పెట్టింది, పెద్ద నాయకులెవరైనా కనిపిస్తే చాలు... టక్కున పడిపోతుంటారని చెప్పాడు. అందరూ ఈ వైట్‌డ్రస్ వేశారు, మీ దేశంలో రాజకీయ నాయకులకు ఇదే మన్నా యూనిఫామ్ లాంటిదా అని జిన్‌పింగ్ అడిగాడు. దానికి రాజ్‌నాథ్ సింగ్.. ఈ డ్రెస్ చాలా సౌకర్య వంతంగా వుంటుంది సార్... దీనిలో వుండే ఆనందం మీ సూటు, కోటులో వుండదు. అదీగాక మాది ఉష్ణమండలం. ఇక్కడ ఎండలకు ఈ డ్రస్సే కరెక్ట్ అని చెప్పాడు. తర్వాత జిన్‌పింగ్‌కు తమిళ సాంప్రదాయ నృత్యాలు, పాటలతో ఘనస్వాగతం పలికారు. కొందరు తమిళ మహిళలు జిన్‌పింగ్‌కు గుమ్మడికాయ, ఎర్రనీళ్లతో దిష్టి తీశారు. నుదుటున విబూది నామాలు పెట్టారు. జిన్‌పింగ్‌కు ఇదంతా కొత్తకొత్తగా అనిపించసాగింది. అక్కడ తంతు ముగిశాక జిన్‌పింగ్ కారెక్కాడు. కాన్వాయ్ బయలుదేరింది... నేరుగా హోటల్ గ్రాండ్ చోళాకు వెళ్లారు. జిన్‌పింగ్ కారు దిగగానే... పంచెకట్టు కుని, తెల్లచొక్కా ధరించిన ప్రధాని నరేంద్ర మోడీ... వణక్కం తంబి... వణక్కం... వాంగే వాంగే అంటూ తమిళ సాంప్రదాయ పద్ధతిలో స్వాగతం పలికాడు. జిన్‌పింగ్‌ను హోటల్ లోపలకు తీసుకెళ్లి ఆయన చేత సాంబార్ అన్నం తినిపించాడు మోడీ. తర్వాత ఆయ నతో... మహాబలిపురం పోదాం... పంచె, చొక్కా వేసుకోండి అంటూ ఆయ నకు కూడా అవి అందించాడు. ఇక తప్పదన్నట్లుగా జిన్‌పింగ్ కూడా సహ యకుల సహకారంతో అడ్డపంచె కట్టి తెల్లచొక్కా వేసుకున్నాడు. పైన టవల్ వేశాడు. అచ్చం తమిళనాడు రాజకీయ నాయకుడి మాదిరిగానే తయారయ్యాడు. ఇక అక్కడ నుండి బయలుదేరి మహా బలిపురం 'సీ షోర్ టెంపుల్' వద్దకు వచ్చారు. టెంపుల్‌లో జిన్‌పింగ్ పేరిట అష్టోత్తరం, సహస్రనామార్చన చేయిం చారు. పూజారి వచ్చి జిన్‌పింగ్‌కు హారతి ఇచ్చి శఠగోపం పెట్టి తీర్థం ఇచ్చాడు. ఆ తర్వాత ఆలయ మర్యాదలతో ఆయనకు శాలువా కప్పి సత్కరించి స్వామి అమ్మ వార్ల చిత్రపటాలను అందజేశారు. ఆ తర్వాత అక్కడే వున్న 7వ శతాబ్దం నాటి శిల్ప సంపదను, దేవాలయాలన్నింటిని జిన్‌పింగ్‌కు మోడీ తిప్పి తిప్పి చూపిం చాడు. జిన్‌పింగ్ చేత కనిపించిన చెట్టుకు, పుట్టకల్లా దండం పెట్టించాడు. అక్కడే వున్న మరో దేవాలయంలో జిన్‌పింగ్ చేత హోమం చేయించాడు. ఆరోజంతా జిన్‌పింగ్‌ను గుళ్లు గోపురాలకే తిప్పాడు నరేంద్ర మోడీ! ఆ రాత్రికి హోటల్‌కు చేరుకున్నారు. గుళ్ళు తిరిగి తిరిగి అలసిపోయి వుండడంతో జిన్‌పింగ్‌కు క్షణాల్లో నిద్ర పట్టేసింది.

★★★★★

జిన్‌పింగ్ భారత పర్యటన ముగించు కుని బీజింగ్ చేరుకున్నాడు. ఎయిర్ పోర్టులో విమానం దిగింది. విమానాన్ని చూసిన చైనా కమ్యూనిష్టు నాయకులు, అధికారులు షాక్ తిన్నారు. కారణం ఆ విమానం చుట్టూ పసుపునీళ్ళు చల్లి వున్నాయి. విమానం మీద చాలాచోట్ల 'ఓం' అని వ్రాసివుంది. విమానంకు ముందు నిమ్మకాయలు కట్టి వున్నాయి. విమానం చుట్టు మామిడాకులు, కొబ్బరి పిలకలు కట్టి వున్నాయి. విమానంలో నుండి ముందుగా చైనా విదేశాంగ మంత్రి డింగ్‌డాంగ్ దిగాడు. క్రింద వీళ్ల కోసం ఎదురుచూస్తున్న చైనా రక్షణ మంత్రి టింగ్‌టాంగ్ వుండి... ఏంటి ఇదంతా, ఈ విమానం పోయేటప్పుడు ఎలా వుంది. వచ్చేటప్పటికి ఎలా వుంది. ఈ నిమ్మకాయలేంటి, ఈ పసుపు, కుంకుమ బొట్లు ఏంటి... మనది దేవుడిని నమ్మని కమ్యూనిష్టు దేశ మనుకుంటు న్నారా? దేవుడిని పూజించే కాషాయదేశ మనుకుంటున్నారా? అని ప్రశ్నించాడు. అందుకు డింగ్‌డాంగ్ వుండి.. ఇప్పుడే ఏం చూశారు. మన అధ్యక్షులవారు విమానం నుండి బయటకొస్తున్నారు చూడండి అని అన్నాడు. అప్పుడే జిన్ పింగ్ విమానం డోర్ నుండి బయట కొచ్చాడు. ఆయనను చూసి అందరూ నోరెళ్ల బెట్టారు. పట్టుపంచె కట్టి, పైన పట్టుదోవతి వేసుకుని, నుదుటన, భుజాలకు విభూది పూసుకుని, మెడలో రుద్రాక్షమాలలు ధరించి చేతుల్లో కలశం, దేవుడి పటాలతో ఆయన వున్నాడు. అది చూసి రక్షణ మంత్రి టింగ్‌టాంగ్... మీరేంటి సార్, ఇండియాకు పోయి ఆ దేశాన్ని మన కమ్యూనిష్టు బాటలోకి తెస్తారనుకుంటే మీరెళ్లి కాషాయం బాట పట్టొచ్చారు అని అడిగాడు. అందుకు జిన్‌పింగ్... ఇప్పటి దాకా మనం కమ్యూ నిజం అనే మైకంలో బ్రతుకుతున్నాం, అసలైన ఆనందం కమ్యూనిజంలో కాదు, కాషాయంలో వుందని నాకు ఈ పర్య టనతోనే తెలిసింది. భారతీయ పూజల్లో, వేదమంత్రాలలో, ఆ గుళ్లల్లో ఏదో తెలి యని మహత్తువుంది. అందుకే మనం కూడా కమ్యూనిజాన్ని వదిలేసి కాషాయం బాటపడదాం. చైనాను హిందూమత దేశంగా ప్రకటిస్తున్నాను. దేశంలోని ప్రతి ఊరిలో వెంకటేశ్వరస్వామి, విష్ణుమూర్తి, శివుడు, ఆంజనేయస్వామి, రాముడు, కృష్ణుడు, సాయిబాబా ఆలయాలను నిర్మించండి. ప్రతి గుడికి పూజారులను నియమించండి. పూజారులకు వేద మంత్రాలు నేర్పించడానికి భారత్ సహకా రంతో ఒక వేదసంస్కృత యూనివర్శిటీని ఏర్పాటు చేయండి. ఇక ప్రతి సంవత్సరం తిరునాళ్ళు, జాతరలు అంగరంగ వైభ వంగా జరుగుతుండాలి. మన దేశ పరిధిలోనే వున్న మానస సరోవర్‌ను మన ఆధ్యాత్మిక రాజధానిగా ప్రకటిస్తున్నాను. ప్రతిరోజూ ప్రతి గుడిలో తెల్లారుజామున సుప్రభాతం, సాయంత్రం భగవద్గీత వినిపించాలి. ప్రతి గ్రామం ఓంకార నామాలతో మారుమ్రోగాలి, మన సినిమా ఇండ్రస్ట్రీ వాళ్ళను కూడా చైనీ భాషలో భక్త కన్నప్ప, భక్త సిరియాల్, సతీ అనసూయ, లవకుశ, శ్రీదేవి కామాక్షి కటాక్షం వంటి భక్తి సినిమాలను తీయ మని చెప్పండి. ప్రధాన నగరాలలో మఠా లను, పీఠాలను ఏర్పాటు చేసి వాటిలో మఠాధిపతులను నియమించండి అని ఆదేశించాడు. రక్షణ మంత్రి టింగ్‌టాంగ్ అంతా విని... సార్, ఇదంతా మనకు పడదు. అసలు దేవుడు, దయ్యం అన్నది మన కమ్యూనిజంలో లేదు. దయచేసి ఈ ప్రయత్నాలు మానుకోండి అని కోరాడు. అప్పుడు జిన్‌పింగ్ కోపంతో.. షటప్ యువర్ మౌత్... ఇంతకుమించి ఒక్క మాట మాట్లాడినా బాగుండదు. ఆధ్యా త్మిక జీవనంలో ఎంత ఆనందం వుందో ఆ మోడీతో తిరగబట్టి తెలిసింది. ఈ ఆనందాన్ని నేను వదులుకోను. నేను రామభక్తుడిగా మారిపోయాను. జై శ్రీరామ్, జైశ్రీరామ్ అంటూ కేకలు వేయ సాగాడు. అప్పుడే అక్కడ 'టకటక'మనే శబ్దం వినిపించింది. జిన్‌పింగ్ 'జై శ్రీరామ్' అని కేకలు పెడుతూనే కళ్ళు తెరిచాడు. తీరాచూస్తే ఆయన చైనా ఎయిర్‌పోర్టులో లేడు. చెన్నైలోని గ్రాండ్ చోళా హోటల్‌లోని తన గదిలోనే వున్నాడు. అప్పటిదాకా జరిగిందంతా కల అని చాలాసేపటికిగాని జిన్‌పింగ్‌కు అర్థం కాలేదు. తలుపు ఎవరో కొడుతున్నట్లు టక్‌టక్ శబ్దం వస్తుండడంతో జిన్‌పింగ్ వెళ్లి డోర్ తీశాడు. ఎదురుగా నరేంద్ర మోడీ... చేతిలో రెండు ప్లాస్టిక్ సంచు లున్నాయి. జిన్‌పింగ్ జీ, అలా బీచ్‌లోకి వాకింగ్‌కు వెళ్దాంరా... బీచ్‌లో ప్లాస్టిక్ బాటిళ్లు, వ్యర్థాలను ఏరుకుని ఈ కవర్ లలో వేద్దాం. మా మీడియా ఆ సీన్స్‌ను బాగా కవర్ చేస్తుందని అన్నాడు. జిన్ పింగ్ వుండి... మోడీజీ, నీతో ఎక్కువ సమయం గడిపితే నేను కూడా మీలాగే రామభక్తుడిగా మారుతానేమోనని భయంగా వుంది. మా దేశాన్ని కూడా కాషాయ దేశంగా మారుస్తానేమోనని అనుమానంగా వుంది. అందుకే నేను మా దేశంకు వెళ్లిపోతా అని అడిగాడు. అందుకు మోడీ... మీకు ఆ భయం అక్కర్లేదు. మీరు ఆధ్యాత్మిక బాట పట్టా లనుకున్నా మా దేశంలోని కమ్యూనిస్టులు మిమ్మల్ని అలా మారనివ్వరులే. మావాళ్ల ధర్నాలు, ఆందోళనలు చేసైనా మిమ్మల్ని కమ్యూనిస్టులుగానే బ్రతకనిస్తారు అని భరోసా ఇచ్చాడు.

అంతలో అక్కడ "చైనా జిందాబాద్" అనే నినాదాలు వినిపించాయి. మోడీ, జిన్‌పింగ్‌లు బయటకొచ్చారు. అక్కడ కమ్యూనిస్టు నేతలు సీతారాం ఏచూరి, డి.రాజు, ప్రకాష్ కారత్, బి.వి.రాఘ వులు, పినరయి విజయన్‌లు ఎర్రజెం డాలు చేపట్టి నినాదాలు చేస్తున్నారు. వాళ్లంతా జిన్‌పింగ్‌తో... సార్, మీరు మోడీతో ఎక్కువ తిరగొద్దు, ఆయనతో తిరిగితే మీరు రామభక్తుడిగా మారి పోతారు. ఆధ్యాత్మిక లోకంలోకి వెళ తారు. మేం కమ్యూనిజాన్ని గురించి చెప్పుకోవడానికి మిగిలివున్న ఒకే ఒక్క దేశం చైనా... దానిని కూడా మీరు కాషాయ దేశంగా మార్చొద్దు అని బ్రతిమ లాడుకోసాగారు. జిన్‌పింగ్ వారితో... మీరు చెప్పినట్లు మోడీతో ఇంకోరోజు తిరిగినా నేను కూడా రామభక్తుడినవుతా, చైనాను కూడా రామరాజ్యంగా ప్రక టించేస్తా... అందుకే అవన్నీ జరగక ముందే తిరిగి చైనాకు వెళ్లిపోతా అంటూ లగేజీ సర్దుకోవడానికి తన గదిలోకి వెళ్లిపోయాడు.

# కళ్యాణ వైభవం...!




పలు పత్రికల్లో ప్రకటనల విభాగాల్లో సుదీర్ఘకాలంగా పనిచేస్తూ.. అందరికీ సుపరిచితుడైన రాజారాం భగవాన్‌సింగ్ - లక్ష్మీబాయిల కుమార్తె **మాధురి - అఖిల్ సింగ్** (మహిమలూరు వాస్తవ్యులు ఎన్.భాస్కర్ సింగ్ - విజయలక్ష్మిల కుమారుడు)ల వివాహం అక్టోబర్ 12వ తేదీ నెల్లూరులోని ఎంసిఎస్ కళ్యాణ మండపం నందు వైభవంగా జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' శుభాశీస్సులు.

# పేదల సౌలభ్యం కోసమే.. ఐపిపి ఖాతాలు

## - నెల్లూరు ఎంపీ ఆదాల


ఐపిపి ఖాతాల సౌలభ్యాన్ని వివరిస్తున్న నెల్లూరు ఎంపీ ఆదాల

దేశంలో పేదవారికి ఆర్థిక సౌలభ్యాన్ని కలుగ జేసేందుకు కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఇండియన్ పోస్ట్‌పేమెంట్ బ్యాంక్ (ఐపిపి) ఖాతాలను ప్రారంభించిందని నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఈనెల 14న ఆయన ఆ ఖాతాలను ప్రారంభింపజేశారు. గ్యాస్, ఆధార్ ద్వారా వచ్చే రాయితీలు ఈ ఖాతా ద్వారా పొందే అవకాశం ఉందని, పోస్టాఫీసుల్లో ఈ ఖాతాను ప్రారంభించి, ఇంటివద్దనే తగు సేవలు పొందవచ్చని ఆయన తెలిపారు. ఎలాంటి డిపాజిట్ లేకుండానే, ఆధార్ వివరాలు అందజేసి ఈ ఖాతాను ప్రారంభించే అవకాశం ఉందన్నారు. జిల్లాలో కూడా ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు పోస్టల్ సూపరింటెండెంట్ కెవిఎస్ వెంకటేశ్వరరావు, పోస్టల్ బ్యాంక్ మేనేజర్ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఆక్రమణలపై కఠినచర్యలు

## - కలెక్టర్ హెచ్చరిక



నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఎం.వి.శేషగిరిబాబు హెచ్చరించారు. 16వ తేదీ నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయంలోని ప్రత్యేకఅధికారి ఛాంబర్‌లో ఆయన నగర పాలక సంస్థ టౌన్‌ప్లానింగ్ అధికారులతో సమావేశమయ్యారు. మురుగునీటి కాలువలు, ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్, పోరంబోకు స్థలాలను ఆక్రమించి పాక్షికంగాను లేదా పూర్తిగాను నిర్మాణాలు చేసిన వాటిని గుర్తించాలని, ఇచ్చిన ప్లాన్‌లకు విరుద్ధంగా కట్టబడిన భవనాలను నవంబర్ 1వ తేదీ నుండి తొలగించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. చాలాచోట్ల వాణిజ్య భవనాలు, నివాస సముదాయాలు కాలువలు ఆక్రమించి మురికినీళ్ళు, వర్షపునీళ్ళు పోకుండా కట్టారు. పార్కింగ్ ఏరియాలను కూడా వ్యాపారాలకు వాడుకుంటున్నారు. ఇలాంటి అక్రమ నిర్మాణాల వల్లే ట్రాఫిక్, డ్రైనేజీ వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. ఆయా కట్టడాల యజమానులపై చట్టపరమైన చర్యలుంటాయని కలెక్టర్ హెచ్చరించారు.

# కొండ్రెడ్డి సంధ్యమ్మకు నివాళులు



విజయ డెయిరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి సతీమణి, మాజీ జడ్పీటీసీ స్వర్గీయ కొండ్రెడ్డి సంధ్య 5వ వర్ధంతి సందర్భంగా ఈ నెల 13వ తేదీన అల్లూరు మండలం నార్త్‌మోపూరులో వారి స్వగృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి పి.అనిల్‌కుమార్ యాదవ్, నెల్లూరు పార్లమెంటు సభ్యులు ఆదాల ప్రభాకర్‌రెడ్డి, మాజీఎమ్మెల్యే జె.కె.రెడ్డి, డిసిసిబి మాజీఛైర్మన్ వేమారెడ్డి శ్యాంసుందరరెడ్డితో పాటు వివిధ రాజకీయపక్షాల నాయకులు, కొండ్రెడ్డి రంగారెడ్డి ఆత్మీయులు, బంధువులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. సంధ్యమ్మ చిత్రపటం వద్ద పూలు చల్లి వారంతా నివాళులర్పించారు.



## అల్లంపాడులో పేర్నాటి కుటుంబసభ్యులచే

# శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయానికి శంకుస్థాపన



కోట మండలం అల్లంపాడు గ్రామంలో పంచముఖి ఆంజనేయస్వామి దేవస్థానం నిర్మాణానికి ఈ నెల 12వ తేదీన వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య శంకుస్థాపన జరిగింది. వైసిపి రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి దంపతులు, పేర్నాటి కుటుంబసభ్యులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. డిసెంబర్ నెలలోగా ఈ దేవాలయాన్ని పూర్తిచేసి కుంభాభిషేక కార్యక్రమాలను నిర్వహిస్తామని ఈ సందర్భంగా పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి తెలిపాడు.



## జిల్లా అంతటా..

# వర్షాలు

## ప్రజల్లో..

# హర్షాతిరేకాలు

జిల్లాలో ఎట్టకేలకు వర్షాలు మొదలయ్యాయి. ఈనెల 14వ తేదీ దాకా కూడా ఎండలు మండిపోయాయి. కాసిన ఎండల ధాటికి వేసవికాలం ఇంకా పోలేదనిపించింది. ఉక్కపోతలు కూడా భరించ లేనంతగా వున్నాయి. 15వ తేదీ ఉదయం నుండి జిల్లాలోని చాలా ప్రాంతాల్లో వర్షాలు మొదలయ్యాయి. అక్కడక్కడా కాలువలు, వాగులు పారుతున్నాయి. ఇప్పటికే పెన్నా నది ప్రవహించడం, ప్రధాన రిజర్వాయర్‌లు నిండడం, ఇప్పుడు వర్షాలు పడుతుండడంతో నీటి కష్టాల నుండి జిల్లా వాసులు గట్టెక్కినట్లే అనుకోవచ్చు.



# మానవాళికి వరం..భగవద్గీత

మానవాళికి భగవద్గీత ఒక వరం వంటిదని, సంసార సాగరంలో ఎదురీదుతున్న జనావళిని తరింపజేసేందుకు ఆవిర్భవించిన మహత్తరమైన గ్రంథమే భగవద్గీత అని చిన్మయామిషన్ స్వామీ పరాత్మనంద సరస్వతి భక్తులకు ఉద్బోధించారు. నగరంలోని వేదాయపాళెం మహాత్మాగాంధీనగర్‌లో ఉన్న శ్రీకృష్ణమందిరంలో ఈనెల 14వ తేదీ రాత్రి జరిగిన 'శ్రీమద్భగవద్గీత-భక్తియోగం' అనే అంశంపై స్వామీజీ ప్రవచించారు. భగవద్గీత మతగ్రంథం కాదని, భక్తిని ప్రబోధించే గ్రంథమని అన్నారు. భక్తి జ్ఞాన వైరాగ్యాల సమ్మేళనమే భగవద్గీత అన్నారు. శ్రీకృష్ణమందిరం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డాక్టర్ ఎంఎస్ రామ్, ఎస్.సుబ్బరామరాజు, ధర్మకర్త చిత్తూరు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# అబ్దుల్ కలాం స్మారక పురస్కారాలు


సత్కారాన్నందుకుంటున్న గుండాల నరేంద్రబాబు

వల్లం నాగేశ్వరరావు చారిటబుల్ ట్రస్ట్(వివిఎన్ఆర్) హైదరాబాద్ వారు డాక్టర్ ఏపిజె అబ్దుల్ కలాం రాష్ట్రస్థాయి స్మారక ప్రతిభా పురస్కారాలు-2019 ప్రదానోత్సవ కార్యక్రమాన్ని ఈనెల 10న నెల్లూరు టౌన్‌హాలులో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా సైనిక సంక్షేమ అధికారి కెప్టెన్ డాక్టర్ పి.సత్యప్రసాద్, జిల్లా ఉప విద్యాశాఖాధికారి విజయలక్ష్మి, ఒంగోలు నరసం గౌరవాధ్యక్షురాలు తేళ్ళ అరుణ, ఒంగోలు శ్రీకృష్ణ దేవరాయ సాహిత్య సేవా సమితి అధ్యక్షులు కుర్రా ప్రసాద్‌బాబు, సాహితీవేత్త చలంచర్ల భాస్కరరెడ్డి, వివిఎన్ఆర్ ట్రస్ట్ ఛైర్మన్ డాక్టర్ వల్లం నవీన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయిలో విభిన్న రంగాల్లో ప్రతిభ కనపరిచిన 13మందికి శాలువ, జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో పురస్కారాలు అందజేశారు. పురస్కారాలు అందుకున్నవారిలో పియల్ నరసింహారావు, వల్లకవి వేంకటసుబ్బారావు, జేయస్ఆర్ ఆంజనేయులు, ఎన్‌సి నరసింహులు, డా. నూనె అంకమరావు, పి.విజయ్, యస్.చెంగయ్య, జి.ఈశ్వరమ్మ, గుండాల నరేంద్రబాబు, కెవిఎన్ కుమార్, కె.కృష్ణ ప్రసాద్, జే. వసుంధర, షేక్ రసూల్‌లు ఉన్నారు.

# మద్యం దుకాణంపై మహిళల నిరసన

సాక్షాత్తూ మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి చెప్పినా వినకుండా ఆత్మకూరు పట్టణంలోని ఆర్టీసి బస్టాండ్ సమీపంలో మద్యం దుకాణం నిర్వహిస్తున్నారని, దీనివల్ల పరిసరాల్లో నివాసం ఉంటున్నవారికి ఎంతో ఇబ్బంది కలుగుతోందని, వెంటనే ఆ దుకాణాన్ని మూసివేయాలని కోరుతూ ఆత్మకూరులో మహిళలు ఆందోళన నిర్వహించారు. అయితే, ఆందోళన చేస్తున్న మహిళలను పోలీసులు ఈడ్చుకెళ్ళి జీప్‌లో ఎక్కించి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సంఘటన ఆత్మకూరులో ఈనెల 14న జరిగింది. ఈ మద్యం దుకాణం విషయాన్ని తాము మంత్రి గౌతమ్‌రెడ్డి దృష్టికి తీసుకవచ్చామని, ఆయన వెంటనే ఎక్సైజ్ అధికారులతో మాట్లాడి దుకాణాన్ని మూసివేయాలని ఆదేశించారని, అయినా ఒకరోజు మాత్రం మూసి వేసి బుధవారం మళ్ళీ తెరిచారని, ఎక్సైజ్ అధికారులు మాత్రం తమకు ఈ దుకాణాన్ని మూసివేయాలని ఎలాంటి ఆదేశాలు రాలేదంటున్నారని మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు వెంటనే ఈ విషయం పరిశీలించి ఈ మద్యం దుకాణాన్ని వేరే ప్రాంతానికి మార్చాలని వారు కోరుతున్నారు.

# విలేకరి హత్య దారుణం

## దుండగులను అరెస్ట్ చేయాలంటూ జర్నలిస్టుల ప్రదర్శన



తూర్పు గోదావరి జిల్లా, తొండంగి అర్బన్‌మండలంలో ఆంధ్రజ్యోతి విలేకరిగా పనిచేస్తున్న కె.సత్యనారాయణ హత్య దారుణమంటూ ఏపియుడబ్ల్యుజె రాష్ట్ర కార్యదర్శి ఏ.జయప్రకాష్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు ఈనెల 16న నెల్లూరులోని గాంధీబొమ్మ వద్ద కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. విలేకరిని హత్యచేసిన దుండగులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్ట్ సంఘం నాయకులు జాకీర్, మాల్యాద్రి, మల్లికార్జున, రవీంద్రనాయుడు, సామ్నా అధ్యక్షుడు సర్వేపల్లి రామమూర్తి, సుబ్బుసింగ్, సింహపురి బాబు, మల్లు రాజేంద్రప్రసాదమూర్తి, గోపీనాథ్, సుధాకర్, భాను, శ్రావణ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## మూగజీవాలకు బాసటగా...

# 'ఊరూరా రాజన్న పశువైద్యం'

## జిల్లాలో కొత్తగా 72 పశువైద్యశాలలు



జిల్లాలో మూగజీవాలకు తరచూ వస్తున్న వ్యాధుల బాధల నుంచి విముక్తి కల్పిస్తూ.. వాటికి మెరుగైన వైద్యం అందించేందుకు వైఎస్సార్సీపి ప్రభుత్వం కొత్తగా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

పల్లెప్రాంతాల్లో ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలను నమ్ముకుని జీవనం సాగించేవారు ఎందరో ఉన్నారు. అయితే, అవసరానికి వాటికి వైద్యం అందుబాటులో లేక అనేక మూగజీవాలు కన్నుమూస్తున్నాయి. దీంతో వాటిని పెంచుకుంటున్న వారి బాధలు వర్ణనాతీతం. ఈ నేపథ్యంలో 'ఊరూరా రాజన్న పశువైద్యం' పథకాన్ని గ్రామీణ ప్రజల ముంగిళ్ళలోకి తెచ్చి వారిని కష్టాల నుంచి నష్టాల నుంచి కాపాడాలని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి డా.వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సూచనలతో ఈ కొత్త పథకం త్వరలో పాడిరైతులకు అందుబాటులోకి రానుంది. ప్రతి గ్రామంలోనూ పశుసంవర్ధక సేవలు వినియోగంలో ఉండాలని, పశువైద్యశాలల పనితీరు మరింతగా మెరుగుపరచాలన్నదే ఈ పథకం ప్రధాన ఉద్దేశం. పశువైద్యానికి సంబంధించి జిల్లాలో ఇప్పుడు 120 దాకా వెటర్నరీ డిస్పెన్సరీలు, 76 గ్రామీణ ఆసుపత్రులు, 20 ఏరియా ఆసుపత్రులు ఉన్నాయి. అయినా మారుమూల పల్లెల్లో, ముఖ్యంగా పాడిపశువులు అధికంగా ఉన్న ప్రాంతాల్లో పశువైద్యం చేరువలో లేకపోవడం వల్ల పాడిరైతులు ఎంతో కాలంగా ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. పశువైద్యశాలలు లేనిచోట్ల మూగజీవాలకు వైద్యచికిత్సలు అందుబాటులో ఉండేందుకు ప్రభుత్వం తాజాగా మరో 72 పశువైద్యశాలలు ఏర్పాటు చేసేందుకు సమాయత్తం అవుతుండడం గ్రామీణ ప్రాంతాల రైతాంగానికి ఎంతో ఆనందం కలిగిస్తోంది. గ్రామ సచివాలయాల్లో ఉన్న పశుసంవర్ధక శాఖ అధికారులను సంప్రదిస్తే పాడిరైతులకు ప్రభుత్వం అందజేస్తున్న పలు పథకాలు, పశువైద్యసేవల వివరాలు కూడా తెలుస్తాయి. జిల్లాలో సత్వర పశువైద్యం చేరువలో ఉండేందుకు ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల జిల్లా రైతాంగంలో సంతోషం వ్యక్తమవుతోంది.

# నెలాఖరులోగా పన్నులు చెల్లించాలి

**- కార్పొరేషన్ కమిషనర్ పివివిఎస్ మూర్తి**

నెల్లూరు నగరంలోని ప్రజలు తమ నివాసాలకు సంబంధించిన పన్నులను ఈ నెలాఖరులోపు చెల్లించాలని కార్పొరేషన్ కమిషనర్ పివివిఎస్ మూర్తి ఒక ప్రకటనలో ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆస్తి పన్నులు, కొళాయి, డ్రైనేజీ, ఖాళీస్థలాల పన్నులను ఈ నెలాఖరులోపు కార్యాలయాల్లో చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని కోరారు. అక్టోబర్ 31వ తేది లోపు పన్నులు చెల్లించనివారిపై నవంబరు 1వ తేది నుంచి చట్టరీత్యా తగు చర్యలు తీసుకుంటామని అన్నారు.

# భాజపా బాటలోకి బాబు?

(మొదటి పేజీ తరువాయి)

ఎవరి రాజకీయ ప్రయోజనాలను వాళ్ళు పరిరక్షించుకునే పనిలో ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో సరికొత్త అంకానికి తెర లేపబోతున్న సూచనలు కనిపిస్తున్నాయి. ఎన్నికలకు ముందు బీజేపీ - తెలుగుదేశంల మధ్య తెగిన బంధం తిరిగి అతుక్కునే దిశగా సంకేతాలు వెలువడుతున్నాయి. ఈ అతుక్కోవడం కూడా ఈసారి పొత్తురూపంలో కాదు, ఏకంగా తెలుగుదేశం పార్టీనే బీజేపీలో కలిపేసే విధంగా వుండొచ్చనే వాతావరణం కనిపిస్తోంది.

నిన్నటి ఎన్నికల్లో తెలుగుదేశం గుల్లగుల్లయ్యింది. చరిత్రలో ఎప్పుడూ లేనంత ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. ఈ పార్టీ కోలుకోవడం చాలా కష్టం. ఏపిలో చంద్రబాబును తొక్కాలని బీజేపీవాళ్ళు గట్టిగా దృష్టిపెడితే ఆ పార్టీకి మిగిలివున్న కేడర్ కూడా చెల్లాచెదురవుతుంది. ఈ సమయంలో చంద్రబాబును తొక్కేయడం బీజేపీ వాళ్ళకు పెద్ద పనికాదు. లాలూప్రసాద్‌యాదవ్, శరద్‌పవార్, చిదంబరంల చేతే చిప్పకూడు తినిపిస్తున్నారు. వీళ్ళతో పోలిస్తే కేంద్రం చేతిలో చంద్రబాబు బొక్కలు చాలానే వున్నాయి. దేనిమీద సిబిఐ దర్యాప్తు జరిపించినా చంద్రబాబును ఇరికించవచ్చు. చంద్రబాబు భయపడుతుండేది కూడా కేంద్రంలోని బీజేపీవాళ్ళు తనను ఏదో ఒక కేసులో ఇరికిస్తారనే. అంతదూరం పరిస్థితి తెచ్చుకోకుండా వుండాలంటే ఆయన ముందున్న మార్గం బీజేపీకి లొంగిపోవడం. వాళ్ళు చెప్పినట్లు నడుచుకోవడం. ఇంతకుముందే తనకు నమ్మిన బంట్లులాంటి నలుగురు తన పార్టీ రాజ్యసభ సభ్యులను ఆయన బీజేపీలోకి పంపించాడు. వీరిలో చంద్రబాబు ఆత్మల్లాంటి సుజనాచౌదరి, సీఎం రమేష్‌లు వున్నారు. వీళ్లను పంపించిందే బీజేపీతో సయోధ్య కోసమని అప్పుడే అర్ధమైంది. ఇటీవల చంద్రబాబు మీడియా మిత్రుడు కూడా బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షాను కలిసి చంద్రబాబు ప్రతినిధిగా రాయబారం నడిపాడు. అంతేకాదు, ఇటీవల కాలంలో ఆయనకు సంబంధించిన మీడియాలో కూడా బీజేపీ అనుకూల కథనాలు ఎక్కువగా వస్తున్నాయి. ఎన్నికలకు ముందు ఇదే మీడియాలో బీజేపీపై విషప్రచారం ఎక్కువగా జరిగింది. కాగా, తాజా పరిణామాల నేపథ్యంలో ఎన్నికలకు ముందు బీజేపీతో విభేదించి తప్పు చేశానని, అదే తన కొంప ముంచిందని చంద్రబాబు స్వయంగా చెప్పుకోవడం అనేక ఊహాగానాలకు తావిస్తోంది. అన్నింటికి మించి చంద్రబాబు ప్రోద్బలంతో బీజేపీలో చేరిన ఎంపి సుజనాచౌదరి తాజాగా... చంద్రబాబు ఒప్పుకుంటే తెలుగుదేశాన్ని బీజేపీలో విలీనం చేయడానికి మధ్యవర్తిగా వుంటానని, బీజేపీ అధిష్ఠానంతో మాట్లాడుతానని చేసిన ప్రకటన భవిష్యత్ రాజకీయ పరిణామాలకు సంకేతంగా నిలుస్తోంది.

ఈ ఎన్నికల తర్వాత గత నాలుగు నెలలకాలంలో జరిగిన సంఘటనలు, పరిణామాలు చూస్తుంటే బీజేపీలో తెలుగుదేశంను విలీనం చేసే ప్రక్రియ చాపక్రింద నీరులా సాగుతుందేమోననిపిస్తోంది.

బీజేపీ అధిష్ఠానం తెలుగుదేశాన్ని విలీనం చేసుకోవడానికి అంగీకరిస్తుందేగాని ఆ పార్టీతో ఇకముందు పొత్తుకు సిద్ధంగా లేరు. టీడీపీతో పొత్తు వల్లే ఏపిలో సొంతంగా ఎదగలేకపోయామనే అభిప్రాయం ఆ పార్టీ అధిష్ఠానంలో బలంగా వుంది. కాబట్టి టిడిపిని విలీనం చేస్తేనే వాళ్ళు చంద్రబాబుతో రాజీపడతారు.

చంద్రబాబుకు కూడా విలీనం చేస్తే పోయేదేమీ లేదు. ఆయనకు కావాల్సింది తనపై కేసులు పెట్టకుండా వుండడం. తనకు, తన కొడుకు లోకేష్‌కు పదవులు సంపాదించడం. పార్టీని విలీనం చేస్తే ఆ ఇద్దరికీ పదవుల గ్యారంటీ వుంటుంది. బీజేపీ వాళ్ళకు కావాల్సింది ఏపిలో బీజేపీ జెండా నాటడం. పదవుల్లో ఎవరున్నా ఇబ్బంది లేదు.

కాబట్టి ఇక్కడ ఒకరి అవసరాలు ఒకరు తీర్చే ప్రణాళిక వుంది కాబట్టి బీజేపీలో తెలుగుదేశాన్ని కలిపేసినా ఆశ్చర్యపోవాల్సిందేమీ లేదు.

# 22, 23 తేదీల్లో జానపద నృత్యాల పోటీలు

జనాభా విద్య కార్యక్రమంలో భాగంగా ఈనెల 22, 23 తేదీల్లో జిల్లాలోని పల్లిపాడు డైట్ కళాశాలలో జిల్లాస్థాయి జానపద నృత్యపోటీలు నిర్వహించ నున్నామని జిల్లా విద్యాశాఖ అధికారి జనార్ధనాచార్యులు తెలియజేశారు. జిల్లాలోని పల్లిపాడు డైట్ కళాశాలలో జరిగే ఈ పోటీలకు జిల్లాలోని ప్రభుత్వ, జడ్పీ, కేజీబివీల్లో చదువుతున్న 9వ తరగతి విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. వివరాలకు 9494296639 ఫోన్ నెంబరుకు సంప్రదించవచ్చని వివరించారు.

# రైల్వే పోలీసుల రక్తదానం

పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఈనెల 16న నెల్లూరులోని రైల్వే పోలీస్‌స్టేషన్‌లో పోలీసులు రక్తదానం చేసి తమ సమాజసేవను చాటుకున్నారు. జిఆర్పీ సిఐ మంగారావు తొలుత రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి తాను స్వయంగా రక్తదానం చేసి స్ఫూర్తిదాయకంగా నిలిచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతిఒక్కరూ రక్తదానం చేసి ఆపదల్లో ఉన్నవారిని ఆదుకోవాలని పిలుపునిచ్చారు. దేశప్రజల రక్షణలో పోలీసుల పాత్ర ఎంతో కీలకమని, తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోలీసులు విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో నోవా బ్లడ్‌బ్యాంక్ నిర్వాహకుడు నాగేశ్వరరావు, అడ్మినిస్ట్రేటర్ మోపూరు భాస్కర్‌నాయుడు, మోటివేటర్ చందు, రైల్వే ఎస్‌ఐలు డిసి వెంకయ్య, ఎస్‌కె సిరాజ్, శంకర్‌రావు, కె.విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# పథకాల పండుగే!

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల మేనిఫెస్టో తనకు భగవద్గీత లాంటిదని చెప్పిన ఆయన, అందులోని ప్రతి అంశాన్ని ఆచరణలోకి తేవడానికే ప్రయత్నిస్తున్నాడు. విరామం లేకుండా ఆయన అమలు చేస్తున్న హామీలతో రాష్ట్రంలో సంక్షేమ పండుగ వాతావరణం నెలకొంది. బహుశా సంక్రాంతి పండుగ దాకా ఈ సంక్షేమం పండుగ వుండొచ్చు. నవరత్నాలను సంక్రాంతికి పూర్తిగా అమలులోకి తెచ్చాక... ఆపైన రాష్ట్రంలో ఇరిగేషన్ ప్రాజెక్ట్‌లు, పారిశ్రామికాభివృద్ధి, రాజధాని వంటి వాటిపై ఆయన పూర్తి స్థాయిలో దృష్టిపెట్టే అవకాశముంది.

# 19న సైబర్ క్రైం పై అవగాహనా సదస్సు

నెల్లూరులోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో వసంతలక్ష్మి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 19వతేది శనివారం ఉదయం 10గంటలకు సైబర్‌క్రైం పై అవగాహనా సదస్సు జరుగుతుందని ట్రస్ట్ ఛైర్‌పర్సన్ డాక్టర్ టి.వసంతలక్ష్మి తెలిపారు. గురువారం తన ఛాంబర్లో విలేఖర్లతో మాట్లాడుతూ జిల్లా ప్రజలకు ముఖ్యంగా మహిళలకు సైబర్ క్రైం మీద అవగాహన కల్పించాలని, ప్రతిఒక్కరూ, ప్రతి పౌరుడు విధిగా ఇంటర్నెట్ వాడకంలో తమ పరిమితులు తెలుసుకోవాలని, ప్రజలు ఏ ఒక్కరూ కూడా సైబర్‌క్రైం వలలో చిక్కుకోకుండా ఉండాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యఅతిథులుగా నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, విశ్రాంత సమాచార హక్కు చట్టం కమిషనర్ డాక్టర్ రమణకుమార్, గుంటూరు రేంజ్ ఐజీ వినీత్ బ్రిజ్‌లాల్, సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయవాదులు పాల్గొంటున్నారని తెలిపారు.

# అన్నదాతకే అగ్ర తాంబూలం

- నెల్లూరులో జయప్రదంగా 'రైతుభరోసా'
- స్వచ్ఛంధంగా తరలివచ్చిన రైతన్నలు
- సీఎం జగన్‌కు స్వాగతం పలికిన వరుణుడు



**అన్నదాతకు వెన్నుదన్నుగా నిలుస్తూ, అన్నం పెట్టే రైతన్నకు పెద్దపీట వేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమానికి ఆణిముత్యాల్లాంటి తన నవరత్నాలలో ఒకటైన 'రైతు భరోసా - పిఎం కిసాన్ సమ్మాన్' పథకం అమలుకు నెల్లూరు నుండే శ్రీకారం చుట్టాడు. ఈ నెల 15వ తేదీన వెంకటాచలం మండలం కాకుటూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సభా వేదికపై ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్‌రెడ్డి వేలాదిమంది రైతుల హర్షధ్వానాల మధ్య రైతు భరోసా కార్యక్రమాన్ని ప్రారంభించారు.**

సార్వత్రిక ఎన్నికల్లో అఖండ విజయం సాధించి, ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టాక తొలిసారిగా నెల్లూరుజిల్లా పర్యటనకు విచ్చేసిన సీఎం జగన్‌కు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలే కాదు... వై.యస్. కుటుంబానికి సెంటిమెంట్ అటాచ్‌మెంట్ వున్న వరుణ దేవుడు కూడా ఘనస్వాగతం పలికాడు. జగన్ హెలికాప్టర్ ల్యాండ్ అయ్యే సమయంలో వర్షం మొదలైంది. దీంతో వై.యస్. వస్తే వానొస్తుంది అనే ప్రజల సెంటిమెంట్ అప్పుడు రాజశేఖరరెడ్డి విషయంలోనే కాదు, ఇప్పుడు జగన్ విషయంలోనూ నిజమైంది. రైతు భరోసా సభకు సర్వేపల్లి, నెల్లూరు రూరల్, నెల్లూరు టౌన్, కోవూరు, గూడూరు, వెంకటగిరి నియోజకవర్గాల నుండి రైతులు, కార్యకర్తలు స్వచ్ఛంధంగా పెద్దఎత్తున తరలివచ్చారు.

## మీ ఋణం తీర్చుకోలేనిది...

సీఎంగా వైయస్ జగన్మోహన్‌రెడ్డి 'నెల్లూరు' అని అప్యాయంగా పిలుస్తూ తన ప్రసంగాన్ని మొదలుపెట్టాడు. నెల్లూరు జిల్లా ప్రజలు తనను మొదటి నుండి ఆదరిస్తున్నారని, ఏమిచ్చినా వారి ఋణం తీర్చుకోలేనంటూ కృతజ్ఞతలు తెలుపుకున్నాడు. ఎన్నికల మేనిఫెస్టోను భగవద్గీత, ఖురాన్, బైబిల్ గ్రంథాలంత పవిత్రంగా చూస్తానని, మేనిఫెస్టోలో చెప్పిన ప్రతి హామీని అమలు చేసే దాకా తనకు మనశ్శాంతి ఉండదని అన్నాడు.

## రైతు బాగుంటేనే.. రాజ్యం బాగుంటుంది

దేశానికి వెన్నెముక అన్నదాతలని, రైతు బాగుంటేనే రాజ్యం బాగుంటుందని, అందుకోసమే 'రైతుభరోసా' క్రింద ఆర్థిక సాయాన్ని 12,500 రూపాయల నుండి 13,500 రూపాయలకు పెంచినట్లు చెప్పాడు. పాద యాత్రలో రైతుల కష్టాలను ప్రత్యక్షంగా చూశాను, వ్యవసాయ ప్రధానమైన జిల్లా కావడంతో మీ జిల్లాకే ఇరిగేషన్ మంత్రిని ఇచ్చాను... నెల్లూరుజిల్లాలో పెండింగ్‌లో వున్న ప్రతి ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ను, ప్రతి కాలువను పూర్తి చేస్తానని ఆయన హామీ ఇచ్చాడు. ప్రతి రైతు ఇంట్లో ధాన్యం చూడాలి... ప్రతి రైతు కంట్లో ఆనందం చూడాలి... పగలే రైతులకు 9గంటల పాటు కరెంట్ ఇచ్చేలా చర్యలు తీసుకున్నాను, రూపాయి పెట్టుబడితో బీమా వర్తింపచేస్తున్నాను. భూ యాజమాన్యానికి ఇబ్బంది లేకుండా 11నెలల పాటు పంటలపై హక్కు వుండేలా కౌలు రైతులకు కూడా రైతు భరోసా సాయం అందిస్తున్నానని చెప్పాడు. అలాగే రైతాంగానికి జగన్ మరిన్ని వరాలు కురిపించాడు. జిల్లాలో వర్షాలు పడ్డాయా... సోమశిల, కండ్లేరు నిండాయా అని ఆయన ప్రశ్నించినప్పుడు.. రైతులు చప్పట్లతో తమ సమాధానం చెప్పారు.

సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కన్నబాబు, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి పి.అనిల్‌కుమార్ యాదవ్, రాష్ట్ర హోంమంత్రి మేకతోటి సుచరిత, రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి, టిటిడి ఛైర్మెన్ వై.వి.సుబ్బారెడ్డి, పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, బల్లి దుర్గాప్రసాద్, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, కిలివేటి సంజీవయ్య, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, వి.వరప్రసాద్, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, రైతు మిషన్ వైస్‌ఛైర్మెన్ నాగిరెడ్డి, వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి పునం మాలకొండయ్య, స్పెషల్ కమిషనర్ అరుణ్‌కుమార్, జిల్లా జాయింట్ కలెక్టర్ వినోద్‌కుమార్, ప్రకాశం జిల్లా ఎస్పీ సిద్దార్ధకౌశల్, జిల్లా వైసిపి నాయకులు ఆనం విజయకుమార్‌రెడ్డి, పేర్నాటి శ్యాంసుందర్‌రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, పి.రూప్‌కుమార్‌యాదవ్, ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, చిల్లకూరు సుధీర్‌రెడ్డి, కొండ్రెడ్డి రంగారెడ్డి, పొణకా దేవసేన, మొయిళ్ల గౌరి, తోట శోభారాణి, ఆనం రంగమయూర్‌రెడ్డి, వైవి రామిరెడ్డి, సన్నపరెడ్డి పెంచలరెడ్డి, బి.శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.








Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com